

# విభారె

## తెలుగు దినపత్రిక

## VIBHARE TELUGU DAILY





PUBLISHED FROM KURNOOL    ఎడిటర్: ఆవుల విజయ భాస్కర రెడ్డి    శుక్రవారం 07 జనవరి 2022    సంపుటి: 03    సంచిక: 130    పేజీలు: 4    వెల: రూ 3-00


# వచ్చే నాలుగు వారాలు కీలకం: డీహెచ్ శ్రీనివాసరావు



హైదరాబాద్: కరోనాతో పాటు కొత్త వేరియంట్ ఒమిక్రాన్ వ్యాప్తి నేపథ్యంలో వచ్చే నాలుగు వారాలు కీలకమని రాష్ట్ర ప్రజారోగ్య సంచాలకులు(డీహెచ్) డా. శ్రీనివాసరావు తెలిపారు. ఫిబ్రవరి నెల మధ్యలో కేసులు మళ్లీ తగ్గే అవకాశం ఉందని చెప్పారు. హైదరాబాద్‌లో మీడియాతో ఆయన మాట్లాడారు. వైరస్‌ను కట్టడి చేయడానికి రాష్ట్ర ప్రజలందరికీ వైద్యారోగ్యశాఖ పలు సూచనలు చేస్తోందని.. వాటిని పాటించాలని డీహెచ్ సూచించారు."ప్రజలంతా తప్పనిసరిగా ఇంటా, బయటా మాస్క్ ధరించాలి. భౌతిక దూరం పాటించాలని కోరుతున్నాం. టీకా తీసుకోనివారు వెంటనే తీసుకోవాలి. న్యూ ఇయర్ నుంచి కేసులు పెరిగాయి. సంక్రాంతికి మరింత కేసులు పెరుగుతాయి. లక్షణాలుంటే సొంత వైద్యం చేసుకోకుండా తప్పక వైద్యులను సంప్రదించాలి. 2 కోట్ల కొవిడ్ పరీక్షలు, కోటికి పైగా హోం ఐసోలేషన్ కిట్లు సిద్ధంగా ఉంచాం. ర్యాపిడ్‌తో పాటు ఆర్టీపీసీఆర్ పరీక్షలు కూడా చేస్తున్నాం. కరోనా మూడో దశను ఎదుర్కొనేందుకు పూర్తి సన్నద్ధంగా ఉన్నాం.తెలంగాణలో జనవరి ఒకటో తేదీ నుంచి కేసులు పెరుగుతున్నాయి. జీహెచ్ఎంసీలోనూ ఎక్కువగానే కేసులు నమోదవుతున్నాయి. దీన్నే ముందుగానే గుర్తించాం. ప్రతి రోజు కొవిడ్‌పై సమీక్షలు చేపడుతున్నాం. రాష్ట్రంలో గత ఐదు రోజుల్లో నాలుగు రేట్లకు పైగా కేసుల పెరుగుదల నమోదైంది. పాజిటివిటీ రేటు కూడా 3శాతానికి పైగా ఉంది. కేసులు వేలాదిగా నమోదవుతున్నా తీవ్ర ప్రభావం లేదు. ఆస్పత్రుల్లో ఎక్కడా ఎక్కువ సంఖ్యలో రోగులు చేరడం లేదు. కొత్త వేరియంట్ బారిన పడిన వారు ఐదు రోజుల్లోనే కోలుకుంటున్నారు. జలుబు, స్వల్ప జ్వరం, తీవ్ర తలనొప్పి వంటి కొన్ని లక్షణాలు ఉన్నాయి. డెల్టా వేరియంట్ పూర్తిగా తొలగిపోలేదు. ఇది సోకితే మూడు రోజుల తరువాత లక్షణాలు తీవ్రమవుతాయి. కొందరు స్వల్ప లక్షణాలున్నా భయంతో ఆస్పత్రుల్లో చేరుతున్నారు. ఇది సరైంది కాదు. భవిష్యత్తులో 90శాతం కేసులు ఒమిక్రాన్‌తోనే ఉంటాయి. ప్రభుత్వం ఇచ్చిన ప్రొటోకాల్స్‌నే ప్రైవేటులో పాటించాలి. అనవసరంగా ప్రజలకు డబ్బు వృథా చేయవద్దు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో అనవసరంగా చికిత్స ఇస్తే చర్యలు తప్పవు. జనవరి 26 నాటికి వ్యాక్సిన్ రెండో డోస్ పూర్తి చేయాలని నిర్ణయించాం. 15 నుంచి 18 ఏళ్ల మధ్య వారికి 10శాతం మందికి తొలి డోస్ ఇచ్చాం. విద్యార్థుల వద్దకే వెళ్లి టీకాలు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నాం.

# పీఆర్సీపై రెండు, మూడు రోజుల్లో ప్రకటన చేస్తాం: సీఎం జగన్



అమరావతి: పీఆర్సీపై కొద్ది రోజులుగా ప్రభుత్వం తీవ్ర కసరత్తు చేస్తున్న విషయం తెలిసిందే. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ బుధవారంనాడు కూడా ఉన్నతాధికారులతో ఈ అంశంపై చర్చించారు. గురువారం మరోసారి అధికారులతో మాట్లాడనున్నారు. ఆ తర్వాత ఉద్యోగ సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించి పీఆర్సీపై ప్రకటన చేసే అవకాశం ఉంది. పీఆర్సీపై ఇప్పటికే ప్రభుత్వం వివిధ స్థాయిల్లో సుదీర్ఘంగా చర్చలు జరిపింది. అనేక ఏళ్లుగా ఊసేలేని జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశాలను పలుమార్లు నిర్వహించి ఉద్యోగ సంఘాల నాయకులు లేవనెత్తిన అంశాలపై ఉన్నతాధికారులు చర్చించారు.కరోనా కారణంగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందికరంగా ఉన్న నేపథ్యంలో ఉద్యోగులను సంతృప్తి పరిచేలా పీఆర్సీ ఎంత ఇవ్వాలనే దానిపై సమాలోచనలు జరిపారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) సమీర్ శర్మ నేతృత్వంలోని కార్యదర్శుల కమిటీ ఇచ్చిన నివేదికపై ఉద్యోగ సంఘాలతో సీఎస్ చర్చించి, పూర్తిస్థాయిలో అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఆర్థిక మంత్రి రాజేంద్రనాథ్, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి అధికారులతో సమావేశమై ఉద్యోగ సంఘాల నాయకులు చెప్పిన ప్రతి అంశంపైనా సుదీర్ఘంగా చర్చించారు. ఈ నేపథ్యంలోనే ఏపీ జేఏసీ, అమరావతి జేఏసీలు ఆందోళనలను విరమించుకున్నాయి.ఉద్యోగులకు ఎంత మంచి చేయగలిగే అంత మంచి చేస్తానని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భరోసా ఇచ్చారు. ఉద్యోగ సంఘాలు చెప్పిన అంశాలను స్వయంగా నోట్ చేసుకున్నానని తెలిపారు. అన్నింటినీ స్ట్రీమ్‌లైన్ చేయడానికి అడుగులు ముందుకేస్తామని, మెరుగ్గా చేయగలిగే దిశగా ప్రయత్నం చేస్తామని పేర్కొన్నారు. దయచేసి అందరూ ప్రాక్టికల్‌గా ఆలోచించాలని ఉద్యోగ సంఘాలను కోరారు. రాష్ట్ర ప్రభుత్వం మోయలేని భారాన్ని మోపకుండా కాస్త సానుకూల దృక్పథంతో ఉండాలని సూచించారు. అన్ని రకాలుగా ప్రయత్నాలు చేస్తామని, మంచి చేయాలన్న తపనతో ఉన్నామని తెలిపారు. 2, 3 రోజుల్లో దీనిపై ప్రకటన ప్రకటన చేస్తామని వెల్లడించారు. తాను కూడా మీ అందరి కుటుంబ సభ్యుడినని, మనసా, వాచా మంచి చేయాలనే తపనతో ఉన్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో ఉద్యోగ సంఘాల నేతల భేటీ ముగిసింది. సమావేశంలో పీఆర్సీపై చర్చ కొనసాగింది. ఇప్పటికే ఉద్యోగ సంఘాలు లేవనెత్తిన అంశాలపై ఉన్నతాధికారులు చర్చించారు. మరోసారి సీఎంతో ఉద్యోగ సంఘాలు సమావేశం కానున్నారు.

మధ్యాహ్నం: 1.26 సీఎం జగన్‌తో ఉద్యోగ సంఘాల నేతల భేటీ ప్రారంభమైంది. ఉద్యోగ సంఘాల తరఫున వెంకట్రామిరెడ్డి, కెఆర్ సూర్యనారాయణ, బొప్పరాజు వెంకటేశ్వర్లు, బండి శ్రీనివాసరావు, ఇతర నాయకులు హాజరయ్యారు.తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయానికి ఉద్యోగ సంఘాల నేతలు చేరుకున్నారు.? పీఆర్సీ అంశంపై చర్చించేందుకు సీఎం వైఎస్ జగన్‌తో ఉద్యోగ సంఘాల నేతలు సమావేశం కానున్నారు. దీనిలో భాగంగా సీఎం క్యాంపు కార్యాలయానికి ఉద్యోగ సంఘాల నేతలు చేరుకున్నారు.

# కడప కలెక్టర్, రెవెన్యూ అధికారులకు ఏపీ హైకోర్టు ఆదేశాలు

అమరావతి: వ్యవసాయ భూములపై కడప కలెక్టర్, రెవెన్యూ అధికారులకు ఏపీ హైకోర్టు ఆదేశాలు ఇచ్చింది. దళిత, బలహీన, నిరుపేదలకు కేటాయించిన వ్యవసాయ భూముల నుంచి బలవంతంగా తొలగించవద్దని హైకోర్టు స్పష్టం చేసింది. ఏళ్ల తరబడి వ్యవసాయం చేసుకుంటున్న వందల కుటుంబాలను బలవంతంగా అధికారులు ఖాళీ చేయిస్తున్నారంటూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ అంశంపై పిటిషనర్ న్యాయవాది జడ శ్రవణ్‌కుమార్ వాదనలు వినిపించారు. బాధిత కుటుంబాలను వ్యవసాయ భూముల నుంచి తొలగించకుండా హైకోర్టు స్టేటస్ కో ఉత్తర్వులు ఇచ్చింది. విచారణను హైకోర్టు మూడు వారాల పాటు వాయిదా వేసింది.




# 'ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం.. రామోజీరావు దిగజారిపోయారు'

ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు అసత్య కథనాలు
రాష్ట్రం ముక్కలవ్వడానికి చంద్రబాబే ప్రధాన కారకుడు
మంత్రి కొడాలి నాని

అమరావతి: చంద్రబాబు, ఎల్లో మీడియా ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేస్తున్నాయని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కొడాలి నాని నిప్పులు చెరిగారు. గురువారం ఆయన తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ, ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు అసత్య కథనాలు రాస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో నిత్యావసర వస్తువుల ధరలపై దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. చంద్రబాబు అబద్ధాలను ప్రచురిస్తూ రామోజీరావు దిగజారిపోయారు. మార్కెట్లో ఉన్న ధరలకన్నా అధిక ధరలు ఉన్నట్టు ప్రచురిస్తున్నారని దుయ్యబట్టారు.రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర వచ్చేలా చర్యలు తీసుకున్నాం. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు ప్రజల సొమ్మును లూటీ చేశారు. ఈనాడు, ఈటీవీ, టీవీ5, ఎబీఎన్ ఆంధ్రజ్యోతిని పూర్తిగా నిషేధిస్తున్నాం. అసత్యాలు ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే మీడియాను



దూరం పెడుతున్నాం. సీఎం జగన్ పాలన ఈ రాష్ట్రంలో 30 ఏళ్ల పాటు ఉంటుంది. అభివృద్ధి, సంక్షేమానికి పాటుపడే సీఎం జగన్‌ను ప్రజలు గుండెల్లో పెట్టుకున్నారు. రాష్ట్రం ముక్కలవ్వడానికి చంద్రబాబు ప్రధాన కారకుడని'' కొడాలి నాని మండిపడ్డారు."హైదరాబాద్‌లో ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుకు శంకుస్థాపన చేసి నిర్మాణం పూర్తి చేసింది మహానేత వైఎస్సార్. ఔటర్ రింగ్‌రోడ్డుకు శంకుస్థాపన చేసింది వైఎస్సారే. చంద్రబాబు ఇందులో చేసిందేమీ లేదని" మంత్రి కొడాలి నాని ధ్వజమెత్తారు.

# 'సీఎం జగన్ అంటే చాలా అభిమానం'




ఆంధ్రప్రదేశ్ సినిమాటోగ్రఫీ మంత్రి పేర్ని నానిని కలుస్తానని దర్శకుడు ఆర్జీవీ అన్నారు. ఈ మేరకు ఆయన వరుస ట్వీట్‌లు చేస్తూ.. 'పేర్ని నాని గారు ప్రభుత్వంతో గొడవ పెట్టుకోవాలి అన్నది మా ఉద్దేశం కాదు.. పర్సనల్‌గా ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంటే నాకు చాలా అభిమానం. కేవలం మా సమస్యలు మేము సరిగా చెప్పుకోలేక పోవడం వల్లనో లేక , మీరు మా కోణం నుంచి అర్థం చేసుకోకపోవడం వల్లలో ఈ మిస్ అండర్ స్టాండింగ్ ఏర్పడింది' అంటూ ట్వీటర్‌లో రాసుకొచ్చారు.దీనికి కంటిన్యూగా మరో ట్వీట్ చేస్తూ.. 'కాబట్టి పేర్ని నాని గారు నా రిక్వెస్ట్ ఏంటంటే మీరు అనుమతిస్తే నేను మిమ్మల్ని కలిసి ఇండస్ట్రీ తరపు నుంచి మా సమస్యలకు సంబంధించిన వివరణ ఇస్తాను. అది విన్న తర్వాత ప్రభుత్వ పరంగా ఆలోచించి సరైన పరిష్కారం ఇస్తారని ఆశిస్తున్నాను' అంటూ వర్మ ట్వీట్ చేశారు. వర్మ ట్వీట్‌కి మంత్రి పేర్నీ నాని రిప్లై ఇస్తూ .. 'ధన్యవాదాలు రామ్ గోపాల్ వర్మ గారు.. తప్పకుండ త్వరలో కలుద్దాం' అని ట్వీట్ చేశారు.

# భద్రతా వైఫల్యం : రాష్ట్రపతితో పీఎం మోదీ భేటీ

న్యూఢిల్లీ : ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ గురువారం రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌తో సమావేశమయ్యారు. పంజాబ్‌లో బుధవారం తన పర్యటన సందర్భంగా జరిగిన భద్రతా లోపాలపై వివరించేందుకు ఆయన సమావేశమైనట్లు జాతీయ మీడియా చెప్తోంది. ప్రస్తుతం వీరిద్దరి సమావేశం కొనసాగుతోంది. ఇదిలావుండగా, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పంజాబ్ పర్యటనలో భద్రతా లోపాలపై దర్యాప్తు చేసేందుకు అత్యున్నత స్థాయి దర్యాప్తు కమిటీని ఆ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఏర్పాటు చేసింది.



మూడు రోజుల్లోగా నివేదిక సమర్పించాలని ఈ కమిటీని ఆదేశించింది. జస్టిస్ (రిటైర్డ్) మెహతాబ్ సింగ్ గిల్, ప్రిన్సిపల్ సెక్రటరీ (హోం అఫైర్స్) అండ్ జస్టిస్ అనురాగ్ వర్మలతో ఈ కమిటీని ఏర్పాటు చేసింది.

# ఒమిక్రాన్. సాధారణ జలుబు కాదు.. లైట్ తీసుకోవద్దు..

హైదరాబాద్ ప్రపంచవ్యాప్తంగా కరోనా మహమ్మారి విజృంభిస్తోంది. రోజురోజుకీ కరోనా కొత్త వేరియంట్ ఒమిక్రాన్ కేసులు వేగంగా పెరిగిపోతున్నాయి.ఒమిక్రాన్ చాపకింద నీరులా వ్యాపిస్తోంది. దేశవ్యాప్తంగా ఒమిక్రాన్ తీవ్ర ప్రభావం చూపుతోంది. ఎన్నడూ లేని విధంగా అమెరికాలో ఒమిక్రాన్ ఉగ్రరూపం దాల్చుతోంది. ఇప్పుడు భారతదేశంలోనూ ఒమిక్రాన్ కేసులు ఒక్కసారిగా పెరిగిపోతున్నాయి. రోజువారీ కేసుల సంఖ్య లక్షవరకు నమోదవుతున్నాయి. ఒమిక్రాన్ వ్యాప్తిపై ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరిస్తోంది.ఒమిక్రాన్ సాధారణ జలుబు కాదని అంటోంది. సాధారణ వ్యాధిగా భావించరాదని హెచ్చరిస్తోంది. లేదంటే




ఒమిక్రాన్ మరింత ప్రమాదకారిగా మారే ముప్పు ఉందని చిఊూ టెక్నికల్ లీడ్ మరియా వాన్ కేర్ఖోవ్ హెచ్చరిస్తున్నారు. ఒమిక్రాన్ వ్యాధి తీవ్రత తక్కువ అయినప్పటికీ అది తేలికపాటి వ్యాధి మాత్రం కాదన్నారు. ఒమిక్రాన్ సాధారణ జలుబు మాత్రం అసలే కాదన్నారు. వృద్ధులు ఈ వేరియంట్ బారినపడితే తీవ్ర అనారోగ్య పరిస్థితికి దారితీసే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

# సీఎం జగన్ సానుకూలంగా స్పందించారు: ఉద్యోగ సంఘాల నేతలు

అమరావతి: ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో ఉద్యోగ సంఘాల నేతల భేటి ముగిసింది. ఈ సందర్భంగా పీఆర్సీపై రెండు మూడు రోజుల్లో మరోసారి సమావేశమై తుది నిర్ణయం తీసుకుంటామని సీఎం జగన్ వెల్లడించారు. ఉద్యోగులకు ఎంత మంచి చేయగలిగే అంత మంచి చేస్తానని భరోసా ఇచ్చారు. ఉద్యోగ సంఘాలు చెప్పిన అంశాలను స్వయంగా నోట్ చేసుకున్నట్లు తెలిపారు. అన్నింటినీ స్ట్రీమ్‌లైన్ చేయడానికి అడుగులు ముందుకేస్తామని, మెరుగ్గా చేయగలిగే దిశగా ప్రయత్నం చేస్తామని పేర్కొన్నారు.మరోవైపు సీఎం వైఎస్ జగన్ ఉద్యోగ సానుకూల నిర్ణయాలను ఉద్యోగ సంఘాలు ప్రశంసించాయి. సచివాలయ వ్యవస్థతో గ్రామ స్వరాజ్యం తెచ్చారని ఉద్యోగ సంఘాలు కొనియాడాయి. 27




శాతానికి తగ్గకుండా ఫిట్ మెంట్ ఉండాలని సీఎం జగన్‌ను కోరినట్లు ఉద్యోగ సంఘాల నేత బొప్పరాజు తెలిపారు. తమ విజ్ఞప్తులపై సీఎం సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు. ఉద్యోగస్తులను సంతృప్తి పరచాలనే ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి ఉన్నారని, సానుకూల నిర్ణయం ఉంటుందని సీఎం వైఎస్ జగన్ చెప్పినట్లు వివరించారు. సీఎం తీసుకునే నిర్ణయానికి కట్టుబడి ఉంటామని పేర్కొన్నారు. అదే విధంగా ఫిట్‌మెంట్ 34 శాతం ఇవ్వాలని సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి కోరారు.

# సంపాదకీయం

శుక్రవారం 07 జనవరి 2022


## పంజాబ్ లో పట్టం ఎవరికి?

పంజాబ్‌లో ఇప్పుడు విచిత్రమైన సన్నివేశం కనిపిస్తోంది. ఓ పక్కేమో కరోనాను కట్టడి చేయడం కోసం కఠినమైన ఆంక్షలు. మరో పక్కేమో ఆ మహమ్మారికి స్వాగతం పలుకుతూ ఎన్నికల ర్యాలీలు..ఇవాళ కాకపోతే రేపైనా కరోనాను కంట్రోల్ చేయవచ్చు. కానీ, అయిదేళ్లకోసారి వచ్చే ఎన్నికలలో ఆ మాత్రం సందడి లేకపోతే ఎలా అన్నది రాజకీయ పార్టీల భావన కావొచ్చు. మహా అయితే మరో రెండు నెలల సమయమే మిగిలి ఉంది కాబట్టే రాజకీయపార్టీలు ఎన్నికల సమరాంగణంలో అనుసరించాల్సిన వ్యూహాలపై కసరత్తులు మొదలు పెట్టాయి. భారతీయ జనతాపార్టీ పంజాబ్‌పై పెద్దగా ఆశలు పెట్టుకోకపోయినా ఏమో గుర్రం ఎగరావచ్చుననే చిగురంత ఆశతో జోరుగా ప్రచారం చేస్తోంది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ కూడా పంజాబ్‌పై గట్టి ఫోకసే పెట్టారు. చలికాలంలోనూ ప్రధాన రాజకీయ పార్టీలు చేసుకుంటున్న విమర్శలు, ఆరోపణలు వేడి పుట్టిస్తున్నాయి. ఈ ఎన్నికలు కాంగ్రెస్‌కు అత్యంత కీలకంగా మారాయి. అధికారాన్ని నిలుపుకోవడం కాంగ్రెస్ ముందున్న ప్రధాన లక్ష్యం. కాంగ్రెస్ పని అయిపోయిందనుకుంటున్న వారికి ఈ విజయంతో ఓ సమాధానం చెప్పాలని కూడా అనుకుంటోంది.. ఇప్పటికే బోలెడన్ని హామీలను గుప్పించింది. మొన్నటి చండీగఢ్ స్థానిక సంస్థల ఎన్నికల్లో సాధించిన విజయంతో ఆమ్ ఆద్మీ పార్టీ జోష్ మీద ఉంది. సర్వేలు కూడా ఆప్‌కు గెలిచే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని చెబుతుండటంతో దూకుడు పెంచింది. పకడ్బందీ వ్యూహంతో ప్రచారంలో దూసుకుపోతున్నది. సీఎం అభ్యర్థిగా ఎంపీ భగవంత్ మాన్ పేరును ప్రకటించింది కూడా ! నెల రోజుల కిందట బీజేపీపై భగవంత్‌మాన్ సంచలన ఆరోపణలు చేశారు. తమ పార్టీలో చేరితే డబ్బు, కేంద్ర మంత్రి పదవి ఇస్తామంటూ బీజేపీకి చెందిన ఓ ప్రముఖ నేత తనకు ఆఫర్ చేశారని, అఇయతే ఆ ఆఫర్‌ను తాను తిరస్కరించారని భగవంత్ మాన్ చెప్పడం సంచలనం సృష్టించింది. డబ్బుతోనో, పదవితోనో తనను కొనాలనుకోవడం మూర్ఖత్వమని కూడా చెప్పారు. బీజేపీ రాజకీయాలన్ని ఇలాగే ఉంటాయని, ఇతర పార్టీల నుంచి రాజకీయ నాయకులను తీసుకోవడంపైనే బీజేపీ దృష్టి పెడుతుందని, ప్రజా సమస్యలు ఆ పార్టీకి పెద్దగా పట్టమని అన్నారు. ఈ విషయాన్ని వదిలేస్తే ఆప్ మాత్రం ఈసారి ఎలాగైనా అధికారం సాధించాలనే గట్టి పట్టుదలతో ఉంది. కాంగ్రెస్ పార్టీలో ఉన్న వర్గ పోరు, ఆకాలీదళ్ పార్టీ బలహీనపడటం, రైతులు బీజేపీ పట్ల వ్యతిరేకంగా ఉండటం ఆప్‌కు బాగా కలిసివస్తున్నాయి. తాము అధికారంలోకి వస్తే ఉచిత విద్యుత్‌ను, ఉచిత తాగునీటిని అందిస్తామని ఆల్‌రెడీ చెప్పిన ఆప్ కీలక రంగాలైన విద్య, వైద్యంపై కూడా ఫోకస్ పెట్టింది. గత ఎన్నికల్లో 20 స్థానాలను సంపాదించి పంజాబ్ అసెంబ్లీలో రెండో అతి పెద్ద పార్టీగా అవతరించింది. పైగా 23.72 శాతం ఓట్లను సంపాదించింది. అప్పట్నుంచే అధికారం దిశగా అడుగులు వేస్తూ వచ్చింది. గత ఎన్నికల్లో లోక్ ఇన్సాఫ్ పార్టీతో జత కట్టిన ఆప్ ఈసారి ఒంటరిగానే బరిలో దిగాలనుకుంటోంది. అప్పుడు లోక్ ఇన్సాఫ్ పార్టీకి ఆరు సీట్లు కేటాయించింది. అందులో రెండు స్థానాలను గెల్చుకుంది.. ఈ ఎన్నికల్లో ఆప్‌ను గెలిపించే బాధ్యతను అరవింద్ కేజ్రీవాల్ తన భుజ స్కంధాల మీద వేసుకున్నారు. ఇప్పటికే నాలుగు విడతల్లో 73 మంది అభ్యర్థుల పేర్లను ఆప్ ప్రకటించింది. కేజ్రీవాల్ జనాకర్షణ ఎంత వరకు ఓట్ల రూపంలో కన్వర్ట్ అవుతుందో చూడాలి. శిరోమణి అకాలీదళ్ పదేళ్ల పాటు పంజాబ్‌లో అధికారంలో ఉండింది. అప్పుడే ఆ పార్టీపై అవినీతి ఆరోపణలు కుప్పలు తెప్పలుగా వచ్చాయి. మరోవైపు విచ్చల విడిగాపెరిగిన డ్రగ్స్ వాడకం కూడా ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చిపెట్టింది. ఈ కారణంగానే 2017లో జరిగిన ఎన్నికల్లో ఓటమి చవి చూసింది. కేవలం 15 అసెంబ్లీ స్థానాలను మాత్రమే సాధించగలిగింది. ఈసారైనా గణనీయంగా సీట్లు సాధించాలనుకున్న అకాలీదళ్‌కు తమ భాగస్వామ్య మిత్రపార్టీ బీజేపీ తెచ్చిన మూడు సాగు చట్టాలు ఆందోళన కలిగించాయి. వెంటనే బీజేపీతో రెండు దశాబ్దాల అనుబంధాన్ని తెంచేసుకుంది. అకాలీదళ్ పార్టీ అధ్యక్షుడు సుఖ్‌బీర్ సింగ్ బాదల్ సతీమణి హర్‌సిమ్రత్ కౌర్ కూడా కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేశారు. అప్పటి నుంచి అకాలీదళ్ అసెంబ్లీ ఎన్నికల మీద దృష్టి పెట్టింది..రైతుల మద్దతు కూడగట్టుకోవడం కష్టంగా భావించిన అకాలీదళ్ దళితలపై ఫోకస్ పెట్టింది. ఎందుకంటే పంజాబ్‌లో 32 శాతం మంది దళితులే ఉన్నారు కాబట్టి. పైగా మాయావతి నేతృత్వంలోని బహుజన్ సమాజ్‌పార్టీతో పొత్తు కూడా పెట్టుకుంది. 20 స్థానాలు బీఎస్‌పీకి కేటాయించింది. 2017 ఎన్నికల్లో 111 స్థానాల్లో పోటీ చేసిన బీఎస్‌పీకి 110 నియోజకవర్గాలలో డిపాజిట్లు కోల్పోయిందన్న విషయం గమనార్హం. సాధించిన ఓట్లు కూడా 1.59 శాతమే. అయితే ఈసారి మాత్రం దళితుల ఓట్లను సంపాదించడంలో మాయావతి సాయపడగలరని అకాలీదళ్ భావిస్తోంది. ఇప్పటికే 91 స్థానాలలో అభ్యర్థులను ప్రకటించింది కూడా. వీరంతా తమ తమ నియోజకవర్గాలలో ప్రచారం మొదలు పెట్టేశారు కూడా!అధికార కాంగ్రెస్ పార్టీకి కూడా కొన్ని ఇబ్బందులు తప్పడం లేదు. అమరీంద్ సింగ్ పార్టీని వదిలిపెట్టేసి పంజాబ్ లోక్ కాంగ్రెస్ పేరుతో కొత్త పార్టీ పెట్టుకున్నారు.. దీని ప్రభావం ఎంతో కొంత కాంగ్రెస్‌పై పడుతుందని కొందరు అంటున్నారు .. బీజేపీతో అమరీందర్ పెట్టుకున్న పొత్తు పెద్దగా వర్క్‌అవుట్ కాకపోవచ్చని మరికొందరు విశ్లేషిస్తున్నారు. 2017లో అకాలీదల్‌తో పొత్తు పెట్టుకున్న బీజేపీ 23 స్థానాలలో పోటీ చేసింది.. కేవలం మూడు స్థానాలలో మాత్రమే గెలుపొందింది. అప్పుడు బీజేపీకి వచ్చిన ఓట్ల శాతం 5.39. 2019లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో మాత్రం పోటీ చేసిన మూడు స్థానాలలో విజయం సాధించింది బీజేపీ. పైగా తమ ఓట్ల శాతాన్ని 9.63కు పెంచుకుంది కూడా! ఇప్పుడు అమరీందర్ సింగ్ ప్లస్ బీజేపీ కలిసి ఎన్ని స్థానాలు గెల్చుకోగలరన్నదే ప్రశ్న. సాగు చట్టాల రద్దుతో రైతులు సంతృప్తి చెందారా? నరేంద్రమోదీ కరిష్మా ఏ మేరకు పని చేయగలదు? అమరీందర్ సింగ్ కాంగ్రెస్ ఓట్లను చీల్చగలరా? ఇలాంటి ప్రశ్నలన్నీ ఉత్పన్నం అవుతున్నాయి.ప్రస్తుత ముఖ్యమంత్రి చరణ్‌సింగ్ చన్నీ, పీసీసీ చీఫ్ నవజ్యోత్ సింగ్ సిద్ధు మధ్య సయోధ్య కుదిరినట్టే అనిపిస్తోంది. అయినప్పటికీ సిద్దు ఎప్పుడు ఏం మాట్లాడతారో, ఎప్పుడు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారోనన్న ఆందోళన మాత్రం కాంగ్రెస్‌లో అలాగే ఉంది. దళితుల ఓట్ల కోసమే చన్నీకి ముఖ్యమంత్రి పదవి అప్పగించారని, ఇప్పుడు జరగబోతున్న ఎన్నికల్లో కూడా చన్నీనే ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించాలని అంటున్నాయి ప్రతిపక్ష పార్టీలు. కాంగ్రెస్ మాత్రం ముఖ్యమంత్రి అభ్యర్థిని ప్రకటించడానికి వెనకాముందు అవుతోంది.

# అమరావతి ముక్కలు

విజయవాడ, జనవరి 6, (న్యూస్ పల్స్)రాజధాని అమరావతి ప్రాంతం ముక్కలవుతోంది. గతంలోనే రాజధాని సిటీ పరిధిలో ఉండవల్లి, పెనుమాక, ఎర్రబాలెం, నవులూరు, నిడమర్రు గ్రామాలను రాజధాని పరిధి నుండి మినహాయించారు. మంగళగిరి రూరల్ మండల పరిధిలోని కురగల్లు, నీరుకొండ, కృష్ణాయపాలెం గ్రామాలను రాజధానిలోనే కొనసాగిస్తున్నారు. నూతనంగా అమరావతి క్యాపిటల్ సిటీ మున్సిపల్ కార్పొరేషన్ (ఎసిసిఎంసి) ఏర్పాటుకు గ్రామసభలు నిర్వహించి అనుమతులు తీసుకోవాలని నోటీసులు ఇచ్చారు. ఆరోతేదీ నుండి సభల నిర్వహణకు షెడ్యూలు కూడా ఇచ్చారు. తుళ్లూరు మండల పరిధిలో 16 గ్రామాలు, మంగళగిరి రూరల్ మండల పరిధిలోని మూడు గ్రామాల్లో సభలు నిర్వహించనున్నారు. దీనిపైనే రైతులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. గతంలో రాజధాని ప్రకటన సమయంలో ఉండవల్లి నుండి బోరుపాలెం వరకూ రాజధానిగా చూపించి దానికి అనుగుణంగా మాస్టర్ ప్లాను వేశారని, ఇప్పుడు కాదంటే ఎలాగని ప్రశ్నిస్తున్నారు. ఒకవేళ క్యాపిటల్ సిటీ మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలంటే అన్ని గ్రామాలతోనూ కలిపి వేయాలని డిమాండు చేస్తున్నారు. వాస్తవంగా సింగపూర్‌కు చెందిన సుర్బానా జురాంగ్ ఇచ్చిన మాస్టర్‌ప్లానులో 25 రెవెన్యూ గ్రామాలు, తాడేపల్లి మున్సిపాలిటీలో కొంత భాగం కలిపి ఉంది. మాస్టర్‌ప్లాను అమలు చేయాలంటే ఈ ప్రాంతం అంతా కలిసి ఉంటేనే సాధ్యం అవుతుంది. లేకపోతే మాస్టర్‌ప్లానుకు విలువ లేదు. ప్రస్తుతం రాజధాని ఇక్కడే ఉంటుందని చెబుతున్న ప్రభుత్వం మాస్టర్‌ప్లానును దెబ్బతీస్తోంది. ఇదే అంశంపై రైతులు పలువురు కోర్టులోనూ గతంలో కేసులు వేశారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తరువాత కొన్ని గ్రామాలను మినహాయించడాన్ని తప్పుబట్టారు. ఒక నగరంగా నిర్దేశించిన ప్రాంతాన్ని ఎలా ముక్కలు చేస్తారని రైతులు కోర్టును ఆశ్రయించారు. కేంద్రం ఇచ్చిన రూ.1000 కోట్ల నిధులు కూడా మాస్టర్‌ప్లాను ఆధారంగానే ఇచ్చింది. అలాగే మొత్తం రాజధాని పరిధిలోని గ్రామాలను కలిపి అమరావతి మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటుకు నిర్ణయిం తీసుకున్నారు. ఇప్పుడు కొత్తగా 19 గ్రామాలకే దాన్ని తగ్గించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఉద్దేశపూర్వకంగానే ప్రభుత్వం అమరావతి ఆనవాళ్లు లేకుండా చేస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే నిర్ణయం ప్రభుత్వం తీసుకునేటట్లయితే మాస్టర్‌ప్లాను అమోదిస్తుందో లేదో చెప్పాలని కోరుతున్నారు. అమరావతి రాజధాని నగర మాస్టర్‌ప్లానుకు కేంద్రం కూడా అంగీకరించింది. అనంతరమే ప్రధాని మోడీ వచ్చి శంకుస్థాపన చేశారు. ఇప్పుడు వైసిపి ప్రభుత్వం ప్లానును ముక్కలు చేస్తుంటే కేంద్రం ఏం చేస్తుందని రైతులు ప్రశ్నిస్తున్నారు. కేంద్రం దీనిపై ఎందుకు స్పష్టమైన ప్రకటన చేయడం లేదని నిలదీస్తున్నారు. అలాగే ఇటీవల కోర్టులో సిఆర్‌డిఎను పునరుద్ధరిస్తున్నామని అఫిడవిట్ దాఖలు చేసింది. అంటే సిఆర్‌డినే ఆమోదించాల్సి ఉంది. మాస్టర్‌ప్లాను రూపొందించింది సిఆర్‌డిఎ గనుక దాన్ని కూడా ఆమోదించాల్సిన పరిస్థితి వస్తుంది. దానికి విరుద్ధంగా ఇప్పుడు 19 గ్రామాలతోనే క్యాపిటల్ సిటీ ఏర్పాటు చేస్తామనడం చర్చనీయాంశం అవుతోంది. గతంలో 29 గ్రామాలతో కలిపిని రాజధానిగా ప్రకటించారని, ఇప్పుడు ముక్కలు చేయడంపై గ్రాసభల్లోనే అధికారులను నిలదీస్తామని చెబుతున్నారు. పూలింగు సమయంలో గుంటూరు జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఇచ్చిన హామీ మేరకు తాము భూములిచ్చామని, వాటిని అమలు చేయాలని కోరతామని రైతులు చెబుతున్నారు.

# గంటా...ఏ ఎండకా గొడుగా..



విశాఖపట్టణం, జనవరి 6, (న్యూస్ పల్స్)నాలుగుసార్లు ఎమ్మెల్యే. ఒకసారి ఎంపీ. గతంలో కిరణ్‌కుమార్‌రెడ్డి, చంద్రబాబు కేబినెట్‌లో మంత్రి. ఇవీ గంటా శ్రీనివాసరావు పొలిటికల్ బయోగ్రఫీలో కీలక అంశాలు. 2019లో ఎమ్మెల్యేగా గెలిచినా.. తాను ఉన్న టీడీపీ అధికారానికి దూరంగా కావడంతో సైలెంట్ అయ్యారు.మధ్యలో గంటా వైసీపీలోకి వెళ్తున్నారని ప్రచారం జరిగింది. తర్వాత బీజేపీవైపు చూస్తున్నారని.. జనసేనలో చేరతారని అనేక ఊహాగానాలు వినిపించాయి. గంటా ఎనాడూ తన రాజకీయ భవిష్యత్‌పై పల్లెత్తు మాట మాట్లాడలేదు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించి కొన్నిరోజులు చర్చల్లో నలిగారు. ఒకానొక దశలో క్రియాశీలక రాజకీయాల నుంచి గంటా తప్పుకొంటున్నారనే ప్రచారం జరిగింది. అటువంటి మాజీ మంత్రి ఇప్పుడు కొత్త సమీకరణాలతో స్క్రీన్‌పైకి వస్తున్నారు.పాతికేళ్ల రాజకీయంలో ఏనాడూ కులం ప్రస్తావన తీసుకురాని గంటా శ్రీనివాసరావు.. ఇప్పుడు తన సామాజికవర్గం బలం.. బలంగంపై ఫోకస్ పెట్టారు. ప్రతి ఎన్నికలకు నియోజకవర్గాన్ని మార్చేస్తారు. కాపు ఓటు బ్యాంకు ఎక్కువగా ఉండే చొడవరం నుంచి తొలిసారి ఎమ్మెల్యే అయ్యారు గంటా. తర్వాత కాపు సామాజికవర్గం ఆధిపత్యం ఉండే అనకాపల్లిలో పీఆర్పీ నుంచి గెలిచారు. ఆ తర్వాత భీమిలి. ప్రస్తుతం విశాఖ నార్త్ నుంచి ఎమ్మెల్యే. ఈ రెండు చోట్లా కాపుల ఓటింగ్ ఉన్నప్పటికీ బీసీలు.. ఇతర సామాజికవర్గాల ప్రాధాన్యం ఎక్కువ. గెలుపుకోసం అనుకూలమైన నియోజకవర్గాలను ఎంచుకున్నారే తప్ప.. ఏనాడూ కులంపై ఆధారపడి రాజకీయాలు చేయలేదు.వాస్తవానికి కాపు సామాజికవర్గం గంటాను తమ కుల నాయకుడిగా చూస్తుందే తప్ప ఆయన ఎప్పుడూ ఆ సామాజికవర్గం కోసం పాటుపడింది లేదు. దీనికి కుటుంబ, రాజకీయ, వ్యాపారాలు కారణమన్నది ఓపెన్ టాక్. గంటా బంధుత్వాలు, వ్యాపార సంబంధాలు విస్తృతం. గతంలో ప్రజారాజ్యం నుంచి ఎమ్మెల్యేగా గెలవడం తప్ప ఆయన కాపు బ్రాండ్‌ను ఎప్పుడూ మీద వేసుకోలేదు. కిర్లంపూడి వేదికగా కాపు రిజర్వేషన్ల ఉద్యమం ఉవ్వెత్తున జరిగినప్పుడు గంటా మంత్రిగా ఉన్నారు. ముద్రగడ పద్మనాభం ఆరోగ్యంపై ఆ సామాజికవర్గం ఆందోళన చెందినప్పుడు కూడా గంటా స్పందించలేదని చెబుతారు. తునిలో బహిరంగసభ ద్వారా తమ ఆకాంక్షలను ప్రభుత్వానికి చెప్పుకోవడానికి కాపులు ప్రయత్నించారు. ఆ సమయంలోనూ లోపాయికారీ మద్దతివ్వడానికి సైతం గంటా వెనకాడారని అపవాదు మోశారు. కాపుల ఆకలి కేకలు వంటి నినాదాలతో ఆ సామాజికవర్గం గంటా ఇంటిని ముట్టడించిన పరిస్థితులు ఉన్నాయి.ఇప్పుడు గంటా శ్రీనివాస్‌లో స్పష్టమైన మార్పు కనిపిస్తోంది. కాపు సామాజికవర్గం లేకపోతే తాను లేననే ధోరణి వినిపిస్తున్నారు. రంగా విగ్రహావిష్కరణ సభలో.. కాపులంతా ఏకం కావాలని ఆయన పిలుపిచ్చారు. ఆ తర్వాత హైదరాబాద్‌లో జరిగిన కాపు ముఖ్యనేతల సమావేశంలో గంటా పాల్గొన్నారు. రెండు కుటుంబాల పాలనకు వ్యతిరేకంగా అన్ని వర్గాలను కలుపుకొని ముందుకు వెళ్లడం ద్వారా కాపులకు రాజ్యాధికారమే అజెండాగా గంటా ప్రయత్నాలు ప్రారంభించినట్టు తెలుస్తోంది. కాపు సామాజికవర్గంలో బలమైన నాయకుడు అనే ముద్ర వేసుకోవడం ద్వారా రాజకీయాలను తనవైపు తిప్పుకునే ప్రయత్నంగా భావిస్తున్నారట. గంటా ఎటువెళ్తే నాయకులు అటు మళ్లుతారనే అభిప్రాయం కలిగించడం ద్వారా ఆ ప్లాట్‌ఫామ్‌ను ఎంచుకున్నారనే చర్చ నడుస్తోంది.నూతన సంవత్సరంలో క్రియాశీలక రాజకీయాల్లోకి రావాలని గంటా నిర్ణయించుకున్నారు. ఇందుకోసం ఆయన క్యాస్ట్ పాలిటిక్స్‌తో రంగ ప్రవేశం చేస్తున్నారని ప్రచారం జరుగుతోంది. వచ్చే ఎన్నికల నాటికి కొత్త పొత్తులు ఉదయించే ఆస్కారం ఉందనే చర్చ జరుగుతోంది. ఆ లాభనష్టాలను ముందే పసిగట్టిన గంటా.. కులం కార్డును అందుకున్నారని సమాచారం. వివిధ కారణాలతో రాజకీయంగా స్తబ్ధతగా ఉన్న నాయకులతో గంటా సమావేశమవ్వడం హాట్ టాపిక్‌గా మారింది. అధికార వైసీపీ సైతం గంటా ఎత్తుగడలను నిశితంగా పరిశీలిస్తోంది. హైదరాబాద్‌లో కాపుల మీటింగ్ కేవలం కాఫీ కోసం జరిగిందే తప్ప ప్రాధాన్యం లేదని లైట్ తీసుకుంది. ఇలాంటి తరుణంలో గంటా శ్రీనివాసరావు వ్యూహం వెనక ఆంతర్యం తెలియాలంటే మరికొన్ని రోజులు వేచి చూడాల్సింది

# టీడీపీలో అనగాని రచ్చ

గుంటూరు, జనవరి 6, (న్యూస్ పల్స్)సినిమా టిక్కెట్ల వ్యవహారం ఏపీలో ప్రస్తుతం హాట్ టాపిక్. టిక్కెట్ రేట్లు మొదలుకుని.. థియేటర్ల సీజ్ వరకు ప్రభుత్వం వర్సెస్ టాలీవుడ్ అన్నట్టుగా ఉంది. సినీ ఇండస్ట్రీకి చెందిన కొంతమంది ఈ సమస్యపై స్పందిస్తుంటే.. మరికొందరు టచ్ మీ నాట్ అన్నట్టుగా ఉంటున్నారు. దీంతో ఈ మొత్తం ఎపిసోడ్‌ను టీడీపీ అడ్వాంటేజ్‌గా తీసుకునే ప్రయత్నం చేస్తున్నట్టుగా కనిపిస్తోంది. అయితే కొందరు టీడీపీ నేతలు చేస్తున్న కామెంట్సే ఆసక్తిగా మారి.. పార్టీలో చర్చకు దారితీస్తున్నాయి.సినీ పరిశ్రమతోపాటు.. థియేటర్ల యాజమాన్యాలు ఇబ్బంది పడుతున్నాయని టీడీపీ ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ ఓ ప్రెస్‌నోట్ రిలీజ్ చేశారు. అందులో ప్రస్తావించిన అంశాలే చర్చగా మారాయి. సినీ రంగాన్ని వేధిస్తుంటే.. సినిమా పెద్దలు ఎందుకు నోరు మెదపడం లేదు? సినిమాల్లో చూపించే మీ హీరోయిజాన్ని.. వైసీపీ సర్కార్‌పై ఎందుకు చూపించడం లేదని ఓ రేంజ్‌లో ప్రెస్‌నోట్ ద్వారా ఫైర్ అయ్యారు అనగాని. రీల్ హీరోలుగానే మిగిలిపోతున్నారు తప్ప.. రియల్ హీరోలుగా మారరా..? అని సూటిగా.. సుత్తి లేకుండానే ప్రశ్నించారు టీడీపీ ఎమ్మెల్యేఇంతకీ అనగాని కామెంట్స్ చేసింది ఎవరిని అనే సన్నాయి నొక్కులు టీడీపీలో మొదలయ్యాయి. సినిమా ఇండస్ట్రీలో ఎమ్మెల్యేగా ఉన్న హీరో బాలకృష్ణ కూడా ప్రధానమైన వ్యక్తే. ఆ విషయాన్ని అనగాని మర్చిపోయారా అన్నది కొందరి ప్రశ్న. రీల్ హీరోలు.. రియల్ హీరోలు అని బాలయ్యను కూడా ప్రశ్నించారా? ఆ కామెంట్ బాలకృష్ణను ఉద్దేశించి కూడా చేశారా అని అంతర్గత సమావేశాల్లో చర్చ పెడుతున్నారట.సినిమా టికెట్ల విషయంలో ముందుగా పవన్ కల్యాణ్, ఆ తర్వాత హీరో నాని, సిద్ధార్థలు స్పందించారు. తర్వాత ఒక్కొక్కరుగా ఈ అంశంపై మాట్లాడుతున్నారు. అయితే ఈ అంశం నుంచి తప్పించుకున్న లేక స్పందించని వాళ్లల్లో బాలయ్య కూడా ఉన్నారని కొందరు గుర్తు చేస్తున్నారు. అఖండ సినిమా రిలీజ్ తర్వాత బెజవాడలో బాలయ్య మాట్లాడినా.. అది పెద్దగా చర్చల్లోకి రాలేదు. దాంతో బాలయ్యను కూడా రీల్ హీరోగానే అనగాని చూసి ఉంటారని పార్టీలో మరికొందరు అభిప్రాయపడుతున్నారట.ఇదే సమయంలో మరో చర్చా జరుగుతోంది. అసలు ప్రెస్‌నోట్ ఇస్తున్న విషయం అనగానికి తెలుసా .. లేక పార్టీనే ప్రెస్‌నోట్ తయారు చేసేసి పంపేసిందా అనే అనుమానాలు ఉన్నాయట. గతంలో స్పీకర్‌ను ఉద్దేశించి అచ్చెన్నాయుడు పేరుతో ఒక ప్రెస్‌నోట్ రిలీజ్ అయింది. దాంతో అచ్చెన్న ప్రివిలేజ్ కమిటీ ముందు హాజరు కావాల్సి వచ్చింది. ఆ సందర్భంగా అచ్చెన్న వివరణపై ఆసక్తికర చర్చ జరిగింది.

# రఘురామ.. ఏం చేస్తారో..

ఏలూరు, జనవరి 6, (న్యూస్ పల్స్) నరసాపురం ఎంపీ రఘురామ కృష్ణరాజు పార్లమెంటు పదవికి రాజీనామా చేయనున్నారు. ఈ మేరకు జోరుగా ప్రచారం జరుగుతుంది. బీజేపీలో చేరేందుకు ఆయన సిద్ధమవుతున్నారు. ఈ నెల 7వ తేదీన రఘురామ కృష్ణరాజు రాజీనామా చేయనున్నారు. బీజేపీలో చేరి ఉప ఎన్నికల్లో పోటీ చేయాలని భావిస్తున్నారు. పార్లమెంటు ఎన్నికలకు ఇంకా రెండేళ్ల సమయం ఉంది. ఈ రెండేళ్లలో మరో ఉప ఎన్నిక తేవాలని రఘురామ కృష్ణరాజు భావిస్తున్నారు. అందుకే ఆయన రాజీనామా నిర్ణయం తీసుకున్నారని తెలిసింది. వైసీపీలో ఉండాలనేనా? రఘురామ కృష్ణరాజు నిజానికి తొలి నుంచి పదవీ కాలం పూర్తయ్యేంత వరకూ వైసీపీలోనే కొనసాగుతూ రెబల్ గా ఉండాలని భావించారు. కానీ బ్యాంకు రుణాల ఎగవేత కేసు మెడకు చుట్టుకునే అవకాశముంది. మరోవైపు అనర్హత వేటు కూడా పెండింగ్ లో ఉంది. దీంతో తాను సేఫ్ లో ఉండాలని రఘురామ కృష్ణరాజు భావించినట్లుంది. ఎంపీ పదవి కంటే ఆయను బ్యాంకు రుణాల ఎగవేత కేసు వ్యక్తిగతంగా ఇబ్బంది పెడుతుంది. . నరసాపురం పార్లమెంటు చరిత్రను పరిశీలిస్తే ఇక్కడ బీజేపీ స్ట్రాంగ్ గా ఉంది. జనసేన కూడా మిత్రపక్షంగా ఉండటంతో రఘురామ కృష్ణరాజు తన గెలుపు సులువు అని భావిస్తున్నారు. నరసాపురం ఉప ఎన్నిక జరిగితే రఘురామ కృష్ణరాజు కు మద్దతుగా టీడీపీ కూడా అభ్యర్థిని నిలబెట్టకపోవచ్చు. దీంతో వైసీపీ అభ్యర్థిపై తనకు సునాయాసం విజయం సాధ్యమవుతుందని రఘురామ కృష్ణరాజు అంచనా వేస్తున్నారు. దీనికి తోడు రఘురామ కృష్ణరాజుపై ఆయన సొంత సామాజికవర్గంలోనూ సానుభూతి ఉంది. ఆయనను అక్రమంగా అరెస్ట్ చేయడం, కొట్టడం వంటివి క్షత్రియ సామాజికవర్గంలో రాజుగారికి మరింత బలం పెంచాయంటున్నారు. క్షత్రియ సామాజికవర్గంలోని అగ్రనేతలందరూ ఆయనతో టచ్ లో ఉండటంతో రాజుగారు రాజీనామా ధైర్యం చేయనున్నారని తెలిసింది.

# సినిమా రచ్చ..రచ్చ

విజయవాడ, జనవరి 6, (న్యూస్ పల్స్)ఇటీవల సినిమా టిక్కెట్ల అంశంపై పెద్ద రచ్చ జరుగుతున్న విషయం తెలిసిందే. పేదలకు కూడా అందుబాటులో ఉండాలని చెప్పి జగన్ ప్రభుత్వం సినిమా టిక్కెట్ల రేట్లని తగ్గించిన విషయం తెలిసిందే. దీని వల్ల నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు, థియేటర్ల మీద ఆధారపడ్డ వేలాది మంది కార్యకర్తలు నష్టపోతారని సినీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. కానీ ఎవరు కూడా పైకి మాట్లాడటం లేదు. ఆ మధ్య న్యాచురల్ స్టార్ నాని మాత్రం మాట్లాడితే?ఆయనపై వైసీపీ మంత్రులు విరుచుకుపడ్డారు. ఇక ఆ తర్వాత ఎవరు దీనిపై స్పందించలేదు. కానీ తాజాగా డైరక్టర్ రామ్ గోపాల్ వర్మ తనదైన శైలిలో మీడియా, సోషల్ మీడియాల్లో జగన్ ప్రభుత్వాన్ని సినిమా టిక్కెట్ల అంశంపై ప్రశ్నిస్తున్నారు. అసలు సినిమా విషయంలో ప్రభుత్వం జోక్యం చేసుకోవడం ఏంటి? అన్నట్లు ప్రశ్నిస్తున్నారు. అలాగే వరుసపెట్టి సోషల్ మీడియాలో మంత్రి పేర్ని నానికి ప్రశ్నలు సంధిస్తూ వస్తున్నారు. దీనికి పేర్ని నాని కూడా కౌంటర్లు ఇస్తూ వచ్చారు.అదే సమయంలో మంత్రి కొడాలి నాని సైతం?వర్మపై విరుచుకుపడ్డారు. పక్క రాష్ట్రాల్లో ఉంటూ, అక్కడ ట్యాక్స్‌లు కడుతూ.. ఇక్కడ ప్రభుత్వాన్ని ప్రశ్నించే అర్హత ఎవరికి లేదని అంటున్నారు. చంద్రబాబు అయినా, ఆయన చెంచా గాళ్ళు అయినా ట్విట్టర్‌లో మొరగడం తప్ప చేసేది ఏం లేదంటూ ఫైర్ అయ్యారు. దమ్ముంటే సినిమా టిక్కెట్ల రేట్లు తగ్గకుండా ఆపండని సవాల్ విసిరారు. ఇక కొడాలికి వర్మ నుంచి కౌంటర్ వ్చేసింది. న్యాచురల్ స్టార్ నాని మాత్రమే అని, కొడాలి నాని ఎవరో తనకు తెలియదంటూ కౌంటర్ ఇచ్చారు. అయితే ఇదంతా వైసీపీ ఆడిస్తున్న గేమ్ అని, వర్మని నమ్మడానికి వీల్లేదని, గతంలో ఆయన చంద్రబాబుని దెబ్బకొట్టి, జగన్‌కు లబ్ది చేకూరేలా చేశారని టీడీపీ శ్రేణులు అంటున్నాయి. ఇక ఏం మాట్లాడినా చంద్రబాబు అని తప్ప, కొడాలి నానికి మరొకటి తెలియదని అంటున్నారు. ఈ సినిమా టిక్కెట్ల వ్యవహారమంతా ఒక డ్రామా అని అంటున్నారు. మరి ఈ రచ్చ ఎంతవరకు వెళుతుందో చూడాలి.

# రివర్స్ లో ఫ్యాన్...

విజయవాడ, జనవరి 6, (న్యూస్ పల్స్)ఏపీలో అధికార వైసీపీకి ఈ మధ్య అన్నీ వ్యతిరేకంగా మారుతున్నట్లు కనిపిస్తున్నాయి. మొన్నటివరకు స్థానిక ఎన్నికల్లో వైసీపీకి వన్‌సైడ్‌గా విజయాలు దక్కడంతో అసలు వైసీపీకి తిరుగులేదనే పరిస్తితి. కానీ నిదానంగా వైసీపీకి వ్యతిరేకంగా రాజకీయాలు జరుగుతున్నట్లు కనిపిస్తున్నాయి. ఎప్పటికప్పుడు జగన్‌కు కొత్త తలనొప్పులు వస్తూనే ఉన్నాయి. ఇప్పటికే ప్రతిపక్ష టీడీపీ, జగన్ ప్రభుత్వాన్ని టార్గెట్ చేసి ముందుకెళుతుంది. అటు జనసేన సైతం దూకుడు పెంచింది. ఇక చివరికి బీజేపీ కూడా వైసీపీపై దాడి పెంచింది. ఆ పార్టీ కూడా జగన్ ప్రభుత్వంపై విరుచుకుపడుతుంది.దీనికి తోడు టీడీపీ-జనసేనలు కలుస్తున్నట్లు ప్రచారం జరుగుతుంది. అటు వైసీపీ రెబల్ ఎంపీ రఘురామ బీజేపీలోకి వెళ్ళి, వైసీపీకి చెక్ పెట్టనున్నారని కథనాలు వస్తున్నాయి. ఇక ఇటు వస్తే జగన్ సోదరి షర్మిల ఏపీలో పార్టీ పెట్టడంపై సంచనల వ్యాఖ్యలే చేశారు. ఆమె ఎప్పుడు పార్టీ పెడుతుందో అర్థం కాకుండా ఉంది. ఇవన్నీ సొంత పార్టీలో ఆధిపత్య పోరు తారస్థాయికి చేరుకుంది. సొంత పార్టీ ఎమ్మెల్యేలపై వైసీపీ నేతలు ఫైర్ అవుతున్నారు. రాష్ట్రంలో చాలా నియోజకవర్గాల్లో ఇదే పరిస్తితి కనిపిస్తోంది. దీని వల్ల వైసీపీకి డ్యామేజ్ అయ్యేలా ఉంది.ఇక జగన్‌కు వ్యతిరేకంగా కాపులంతా ఏకమవుతున్నట్లు కనిపిస్తోంది. ఇప్పటికే వంగవీటి రాధా ఎపిసోడ్‌తో సీన్ మారింది. కాపు నేతలంతా ఒకచోట చేరి జగన్‌కు వ్యతిరేకంగా పావులు కదుపుతున్నారు. ఇదొక తలనొప్పి అనుకుంటే తాజాగా మరో తలనొప్పి మొదలైంది. ఇటీవల వైసీపీ నేత సుబ్బారావు గుప్తాపై?మరో వైసీపీ నేత దాడి చేసిన విషయం తెలిసిందే.అయితే మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి సమక్షంలో ఈ సమస్య చల్లబడింది అనుకుంటే?తాజాగా గుప్తా, వంగవీటి రాధాని కలిశారు. ఇక ఆయనతో ఏం చర్చించారో ఎవరికి క్లారిటీ లేదు. పైగా వైశ్యులతో ఒక సభ పెట్టారు. వారు జగన్ ప్రభుత్వానికి యాంటీ అయ్యేలా చేస్తున్నారు. ఇలా అన్నీ రకాలుగా జగన్‌కు తలనొప్పులు పెరిగిపోయాయి. ఇలా ప్రతిదీ జగన్‌కు వ్యతిరేకంగా మారిపోతుంది.

# ధర్మాన అసహానం వెనుక....

శ్రీకాకుళం, జనవరి 6, (న్యూస్ పల్స్)ఎందుకో ఈ మధ్య ధర్మాన ప్రసాదరావు అసహనానికి గురవుతున్నారు. ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టేవిధంగా ఆయన వ్యాఖ్యలు చేస్తుండటం పార్టీలో చర్చనీయాంశమైంది. ధర్మాన ప్రసాదరావు కావాలనే ఈ కామెంట్స్ చేస్తున్నారా? లేక అన్యాపదేశంగా చేస్తున్నారా? అన్నది తెలియదు కాని గత రెండు రోజుల నుంచి ధర్మాన ప్రసాదరావు చేస్తున్న వ్యాఖ్యలు రాజకీయంగా పార్టీకి ఇబ్బందికారంగా మారాయి. ధర్మాన ప్రసాదరావు ఆషామాషీ నేత కాదు. ఆయన అనుభవమున్న నేత. మంత్రిగా పనిచేశారు. ఆయనకు అన్ని విషయాలపై సంపూర్ణ అవగాహన ఉంది. ప్రభుత్వం ఏర్పడి మూడేళ్లవుతున్నా తాను మంత్రిని కాలేకపోయానన్న దిగులు తప్పించి ఆయన పార్టీలో కంఫర్ట్ గానే ఉన్నారు. కానీ ఎందుకో అప్పుడప్పుడు మంత్రి పదవి విషయం మెదడును తొలుస్తున్నట్లుంది. అందుకే తరచూ వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తున్నారు. ధర్మాన ప్రసాదరావు నిన్న చెత్త పన్నుపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. చెత్త పన్ను వందరూపాయలు చెల్లించకపోతే వారి ఇంటిముందు పారేయమని పిలుపు నిచ్చారు. పన్ను చెల్లించని వారి ఇళ్ల ముందు చెత్తను పారేయమని మున్సిపల్ సిబ్బందికి ఆదేశాలు జారీ చేయడంతో అది రాష్ట్ర వ్యాప్తంగా వివాదాస్పదమయింది. విపక్షాలు ధర్మాన వ్యాఖ్యలపై మండిపడుతున్నాయి. చెత్త పన్ను మరోసారి రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమై పార్టీ ఇరకాటంలో పడింది.

# మన్యంలో బంద్

విశాఖపట్నంజనవరి 6, (న్యూస్ పల్స్) ప్రజా గిరిజన సంఘాల నేతృత్వంలో గురువారం మన్యం బంద్ నిర్వహించారు. వివిధ గిరిజన ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నేడు రాష్ట్ర వ్యాప్తంగా మన్యం బంద్ ప్రకటన చేయడం తెలిసిందే. గిరిజనులు పలు డిమాండ్స్ తో బంద్ కి పిలుపునిచ్చారు. ఈ మేరకు విశాఖ మన్యంలో బంద్ ప్రశాంతంగా కొనసాగింది. బంద్ నేపథ్యంలో అప్రమత్తమయిన పోలీసులు, ఆయా ప్రాంతాల్లో కట్టుదిట్టమైన పోలీస్ పికెట్ ఏర్పాటు చేసారు. బంద్ కారణంగా ఏజెన్సీ లో పర్యాటకులకు ఇబ్బందులు ఎదురయ్యాయి.

# రైతుల సజ్జ పంట ధాన్యాన్ని మార్క్ఫెడ్ ద్వార కొనుగోలు చేయాలి

**రాష్ట్ర రైతు సలహాదారు అంబటి కృష్ణారెడ్డి**

కడప జనవరి 6, (న్యూస్ పల్స్) కడప జిల్లా బద్వేల్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో రాష్ట్ర రైతు సలహాదారు అంబటి కృష్ణారెడ్డి సజ్జ పంట ధాన్యం కొనుగోలు పై మీడియా సమావేశం ఏర్పాటు చేశారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బద్వేల్ నియోజకవర్గంలోని అట్లూరు, బద్వేల్ ,గోపవరం, బి.కోడూరు పోరుమామిళ్ల, కాశినాయన ,కలసపాడు మండలాలలో గత ఆగస్టు నెలలో రైతులు సజ్జ పంటను కోసి ధాన్యాన్ని రైతులు అమ్మేందుకు సిద్ధం చేశారు. ప్రభుత్వం మద్దతు ధర గా 2250 రూపాయలు క్వింటాలు ధర నిర్ణయించింది .అదే బహిరంగ మార్కెట్లో క్వింటాలు 1750 రూపాయలు మించి ఉండటం లేదు. దీంతో రైతులు ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా విక్రయించాలని నాలుగు నెలలుగా ధాన్యాన్ని గృహాల్లో నిల్వ చేసుకున్నారు .కానీ మార్క్ఫెడ్ డిఎం లావణ్య ఎన్నికల కోడ్ అనంతరం సజ్జ పంట ధాన్యాన్ని కొనుగోలు చేస్తామన్నారు .కానీ నవంబర్ నెలలో వర్షాలు కురవడంతో కొనుగోలు చేయలేదు. దీంతో నాలుగు నెలల జాప్యం జరగడంతో కొందరి రైతుల ధాన్యం లో పురుగు ఉన్నాయన్న సాకుతో మార్కఫెడ్ వారు కొనుగోలు చేయడం లేదు .మన సీఎం జగన్ మోహన్ రెడ్డి రైతులు ఎవరు నష్టపోకూడదనే ఆదేశాలు జారీ చేస్తున్న మార్క్ఫెడ్ వారు నిర్లక్ష్యంగా వ్యవహరించి కొనుగోలు చేయకపోవడంతో చాలామంది రైతులు ఇప్పటికే బహిరంగ మార్కెట్లో అమ్ముకొని తీవ్రంగా నష్టపోయారు .ఇప్పటికైనా మిగిలివున్న ధాన్యాన్ని మార్క్ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని రైతు సలహాదారు అంబటికృష్ణారెడ్డి మార్క్ ఫెడ్ వారికి సూచించారు.

# బుల్లి బాయ్ నిందితులను కఠినంగా శిక్షించాలి

విశాఖపట్నం జనవరి 6, (న్యూస్ పల్స్) బుల్లీ బాయ్ యాప్ నింది తులను కఠినంగా శిక్షించాలంటూ మ హిళా చేతన, ముస్లీం సంఘాల నేతలు డిమాండ్ చేశారు.మహిళా చేతన నాయకురాలు కత్తిపద్మ మాట్లాడుతూ ముస్లిం మహిళలను,బాలికలను యా ప్ లో అశ్లీలంగా మార్ఫింగ్ చేసి ,వేలం పాట నిర్వహించడం హేయమైన చర్య అని , ముస్లీం మహిళలను టార్గెట్ చేస్తున్న వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.ముగ్గురు టీనేయర్స్ ను అరెస్ట్ చేసి చేతులు దులుపుకో వడం కాదని,యాప్ వెనుక వున్న అస లు వ్యక్తులను ఎవరో బైట పెట్టాలని కోరారు.న్యాయవాది జహీర్ మాట్లా డుతూ అరాజకాలను ప్రశ్నించిన మహిలను వేలం వేస్తూ కించపరిచే చర్యలు జరుగుతున్నాయని అన్నారు. మైనార్టీలను భయపెట్టాలని ఇదంతా చేస్తున్నారని హిందూ ఓటు బ్యాంకును కొల్లగొట్టాలనే ఉద్దేశంతో ఇటువంటి చర్యలు జరుగుతున్నాయని అన్నారు. హక్కులను కాలరాయడమే కాకుండా మత విద్వేషాలకు దారితీసే పరిస్థితి రావచ్చని అన్నారు.

# సింహగిరిలో ధనుర్మాస ఉత్సవాలు

విశాఖపట్నం వరాహ లక్ష్మీ నృసింహ స్వామి వారి దేవస్థానం సింహాచలంలో ధనుర్మాస ఉత్సవములను పురస్కరించుకుని 22వ రోజు అమ్మవారి తిరువీధి సేవ చేయటం జరిగినది. ఆండాళ్ అమ్మవారి సన్నిధియందు 22వ పాశుర విన్నపం చేసినారు.శ్రీ వైష్ణవ సంప్రదాయంలో విశేషమైన పగల్ పత్తు ఉత్సవములలో భాగంగా 4వ రోజు స్వామి వారి తిరువీధి సేవ వేద, ఇతిహాస, పురాణ, దివ్య ప్రబంధ పారాయణల నడుమ నాదస్వర మేళ తాళాలతో శ్రీ పాంచరాత్ర ఆగమానుసారం అత్యంత వైభవంగా స్వామి వారి సన్నిధియందు జరిగినది.అనంతరం ఉభయ దేవేరుల సమేతంగా స్వామి వారిని ఆస్థాన మంటపములో వేంచేపు చేసి నాళాయిర దివ్యప్రబంధ పారాయణం చేసినారు.అనంతరం శ్రీదేవి భూదేవి సమేతంగా స్వామివారిని ఆలయంలో వేంచేపు చేయడంతో 4వ రోజు కార్యక్రమం సర్వజన మనోరంజకముగా ముగిసినది.

# విశాఖ ప్రాజెక్టులపై కేంద్రానికి నివేదిక

విశాఖపట్నం జనవరి 6, (న్యూస్ పల్స్) విశాఖలో కేంద్రం చేపట్టిన ప్రాజెక్టుల నిర్మాణం తీరు పరిశీలనకు రెండు రోజుల పర్యటన నేటితో పూర్త వుతోందని,ఈ ప్రాజెక్టుల పూర్తికి ఏమి అవసరమో చూసి కేంద్రం దృష్టికి తీసు కువెళతామని బీజేపీ ఎంపీ జివిఎల్ అన్నారు.441 కోట్లతో గంభీరంలో ఐఐఎం నిర్మాణం సాగుతోందని,దీన్ని ప్రజలు సందర్శించే అవకాశం కల్పించాలని అన్నారు.సమీర్ రీసెర్చి సంస్థ ను కూడా సందర్శించామని,మెడిటెక్ లో అత్యాధునిక వైద్య సామగ్రి తయా రవుతోందని అన్నారు.హెచ్.పి.సిఎల్ విస్తరణ పనులు కూడా చూశామని 28 వేల కోట్లతో 15 మిలియన్ టన్నులకు ఉత్పత్తి పెంచుతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టుల సత్వర పూర్తికి సహకరించాలని విశాఖలో స్మార్ట్ సిటీ ప్రాజెక్టుల ప్రస్తుత స్థితిని సమీక్షించామని 940 కోట్లతో నిర్మిస్తున్న డ్రెయినేజి పథకం అనుకున్న టైముకి పూర్తి చేయాలని అన్నారు.అమృత్ పథకం కింది 247 నీటి సరఫరా పథకం వేగంగా పూర్తి చేయాలని, ఇఎస్ఐ ఆస్పత్రి నిర్మాణానికి తగిన మౌలిక వసతులుకల్పించాలని కోరామని తెలిపారు.

### ముక్కంటిని దర్శించుకున్న యూపిఎస్సీ సెక్రటరీ వసుధ మిశ్రా

శ్రీకాళహస్తి యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సెక్రటరీ వసుధ మిశ్ర శ్రీకాళహస్తీశ్వర స్వామివారిని గురువారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ కార్యనిర్వహణాధికారి పెద్ది రాజు ఆదేశాల మేరకు ఆలయ అధికారులు దక్షిణ గోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం శ్రీస్వామి అమ్మవార్ల గర్భాలయం నందు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ మేధా దక్షిణామూర్తి సన్నిధి వద్ద దుశ్శాలువ తో ఘనంగా సత్కరించి తీర్థప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి పెద్దిరాజు, ఏ ఈ ఓ ధనపాల్, డిప్యూటీ ఈవో కృష్ణారెడ్డి, ప్రోటోకాల్ సూపర్డెంట్. నాగభూషణం యాదవ్. ఆలయ తనిఖీ ల అదికారి విజయ సారధి, తదితరులు పాల్గొన్నారు

# అట్టహాసంగా గన్నెల పంచాయతీ గ్రామ సభ



విశాఖపట్నం జనవరి 6, (న్యూస్ పల్స్) అరకులోయ మండలంలో గల గన్నెల పంచాయతీ కేంద్రంలో స్థానిక సర్పంచ్ బి. బి.బొజ్జ అధ్యక్షతన జరిగిన గ్రామ సభ అట్టహాసంగా నిర్వహించారు.ముందుగా గ్రామ సభలో విచ్చేసిన అందరిని నూతన సంవత్సరాల శుభాకాంక్షలు తెలియజేస్తూ గ్రామ కార్యదర్శి రాజేంద్ర కుమార్ శాఖల వారీగా సమీక్షలు నిర్వహించి గతంలో జరిగిన పనుల అభివృద్ధి గురించి చదివి క్లుప్తంగా వివరించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ సభ ప్రతి ఏటా నాలుగు దఫాలుగా ప్రతి పంచాయతీలో నిర్వహించబడుతుంది.ఇటువంటి గ్రామ సభలో మన ఒక పంచాయితీ పరిధిలో ఉన్న గ్రామల సమస్యలు గాని,వారి వారి వ్యక్తిగత సమస్యలు గాని వార్డు సభ్యులు,గ్రామ వాలంటీర్లు, గుర్తించి నేరుగా గ్రామ సభలో సమస్యలు దరఖాస్తు రూపంలో సంబంధిత శాఖల వారికి ఇవ్వొచ్చునారు.ఈ యొక్క సమస్యలను పంచాయితీలో ఆమోదించి సంబంధిత శాఖల వారికి దాఖలు చేయడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిధిలుగా జెడ్పిటిసి సభ్యురాలు శెట్టి రోషిణి ఎంపీటీసీ సభ్యురాలు బి.లలిత దేవి పాల్గొన్నారు.పలువురు మాట్లాడుతూ గ్రామ సభలో ప్రజలు పాల్గొనడం వలన సమస్యలు,పరిష్కార మార్గాలు తెలుసుకుని జవాబుదారితనం పెరుగుతుందన్నారు. పంచాయతీల గ్రామాలలో ఎటువంటి సమస్య ఉన్న మా దృష్టికి తీసుకువస్తే స్థానిక ఎమ్మెల్యే శెట్టి పాల్గుణ దృష్టికి తీసుకెళ్లి అయ్యా సమస్యను పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అనంతరం నేచర్ సంస్థ మండల కో ఆర్డినేటర్ టి.సంతోష్ కుమార్ మాట్లాడుతూ సంస్థ ద్వారా చేస్తున్నటువంటి కార్యక్రమాల గురించి గుప్తంగా వివరించారు.అనంతరం నూతనంగా మంజూరైన వైయస్సార్ పింఛన్లను 5 మంది లబ్ధిదారులకు 2500 రూపాయలు లబ్ధిదారులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో వైసిపి ఎస్.టి సెల్ అధ్యక్షులు కె.అశోక్,వైస్ సర్పంచ్ చిన్నారావు,వార్డు సభ్యులు కె. అశ్విన్ కుమార్ సచివాలయం సిబ్బంది నేచర్ సంస్థ సిబ్బంది మన్మథరావు చలం గ్రామస్తులు గ్రామ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు

# ఎన్నికల కోసం డ్రామాలు వద్దు

**రాజకీయ నాటకాలు తగవు**

**ఆర్ ఎస్ ఎస్ భావజాలం నుంచి బయట పడాలి**

**పంజాబ్ ముఖ్యమంత్రి దిష్టి బొమ్మ దగ్ధం శోచనీయం**

**- ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ సాకే శైలజనాథ్**

విజయవాడ కేంద్ర ప్రభుత్వం కేవలం ఎన్నికల కోసమే రాజకీయ డ్రామాలకు తెర తీసిందని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ సాకే శైలజానాథ్ ధ్వజమెత్తారు. రైతుల చావులకు కారణమైన నరేంద్ర మోడీ పరిపాలనను వ్యతిరేకిస్తూ ప్రధాని కాన్వాయిని అడ్డగిస్తే పంజాబ్ ముఖ్యమంత్రి దిష్టి బొమ్మను బీజేపీ అధ్యక్షుడు సోము వీర్రాజు నేతృత్వంలో గురువారం విజయవాడ లో ఆయన మూక దగ్ధం చేయడం శోచనీయమన్నారు. ఈ మేరకు విజయవాడ ఆంధ్ర రత్న భవన్ నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు. బీజేపీ నాయకులపై రాష్ట్రానికి అంత ప్రేమ ఉంటే ప్రధాని నరేంద్ర మోడీ, హోమ్ మంత్రి అమిత్ షా లను రాష్ట్రానికి తీసుకువచ్చి ప్రత్యేక హోదా ఇప్పించాలని, రైల్వే జోన్ ఇప్పించాలని, రాష్టానికి రావాల్సిన పోలవరం నిధులతో పాటు రాయలసీమ, ఉత్తరాంధ్రకి రావాల్సిన ప్యాకేజీలను ఇప్పించాలని డిమాండ్ చేశారు. ఆర్ ఎస్ ఎస్ భావజాలం నుంచి బీజేపీ నాయకులు బయటకు వచ్చి రాష్ట్ర ప్రయోజనాల గురించి ఆలోచిస్తే ప్రయోజనం ఉంటుందని శైలజానాథ్ హితవు పలికారు.

# ఒకే విమానంలో ప్రయాణించిన 125 మందికి కరోనా..



అమృత్‌సర్: కరోనా మహమ్మారి మళ్లీ తన ప్రతాపాన్ని చూపేందుకు సిద్ధంగా ఉంది. దేశంలో వైరస్ వ్యాప్తిని అడ్డుకట్ట వేసేందకు ఇప్పటికే ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయి. అయితే ఎన్ని జాగ్రత్తలు తీసుకుంటున్న కేసులు మాత్రం రోజురోజుకి పెరుగుతూనే ఉన్నాయి. దీంతో భారత్‌లో థర్డ్ వేవ్ ప్రారంభమైనట్లు అయినట్టు ఆరోగ్యశాఖ స్పష్టం చేస్తూ, రాబోయే నాలుగు వారాలు జాగ్రత్తగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వాలకి ఆదేశాలు జారీ చేసింది. గతంలోనూ విదేశాల నుంచి వచ్చిన ప్రయాణికుల ద్వారానే దేశంలో వైరస్ వ్యాప్తికి ప్రధాన కారణమన్న సంగతి తెలిసింది. అందుకే ఈ సారి బయట దేశాల నుంచి వచ్చే ప్రయాణికులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాయి ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు. ఈ క్రమంలో పంజాబ్‌లోని అమృత్‌సర్ విమానాశ్రయంలోకి వచ్చిన చార్టర్డ్ విమానంలో కరోనా కలకలం రేగింది. గురువారం ఇటలీ నుంచి అమృత్సర్‌కు చార్టర్డ్ ఫ్లైట్‌లో వచ్చిన ప్రయాణికులను పరీక్షల జరుపగా అందులో 125 మందికి కరోనా నిర్ధారణ అయినట్లు అధికారులు తెలిపారు. దీంతో వీరి శాంపిల్స్‌ను జీనోమ్ సీక్వెన్స్‌కు పంపారు. విమానంలో మొత్తం 179 మంది ప్రయాణికులు ఉన్నారు. పాజిటివ్‌గా తేలిన ప్రయాణికులను ఇన్‌స్టిట్యూషనల్ క్వారంటైన్‌కు పంపిస్తామని రాష్ట్ర ఆరోగ్య అధికారులు తెలిపారు.

# థర్డ్ వేవ్ ప్రారంభమైంది- జరా భద్రం

హైదరాబాద్, జనవరి 6, (న్యూస్ పల్స్)ఓమిక్రాన్ వ్యాప్తితో జనం ఓ మైగాడ్ అంటూ తలలు పట్టుకుంటున్నారు. ప్రపంచానికే పెను సవాల్ గా మారిన కరోనా మహమ్మారి తగ్గినట్లే తగ్గి మళ్లీ జడలు విప్పుతోంది. హైదరాబాద్ లో నమోదవుతున్న కేసులు రోజురోజుకు రెట్టింపు అవుతున్నాయి. దీంతో గ్రేటర్ హైదరాబాద్ అప్రమత్తమైంది. ఇప్పటికే రోజువారీ కేసుల సంఖ్య వెయ్యికు చేరుకుంటుండటంతో బల్దియా హెల్త్ డిపార్ట్మెంట్ అలర్ట్ అయింది. ముందునుంచి వ్యాక్సినేషన్ వందశాతం సక్సెస్ అయ్యేలా చర్యలు తీసుకున్న అధికారులు.. వైద్య శాఖ సూచనల మేరకు జీహెచ్ఎంసీ పరిధిలో కరోనా వ్యాప్తి నివారణకు చర్యలు చేపట్టారు.హైదరాబాద్ మహానగరంలో కరోనా మళ్లీ విజృంభిస్తోంది. మూడు రోజులుగా రికార్డు సంఖ్యలో కేసుల పెరుగుదల ఆందోళన కలిగిస్తోంది. న్యూ ఇయర్ వేడుకల తర్వాత మళ్లీ రికార్డు స్థాయి కేసులు నమోదవుతున్నాయి. హైదరాబాద్ మహానగరం రోజు వారీ కేసుల సంఖ్య వెయ్యికు చేరువైంది. తెలంగాణ వ్యాప్తంగా బుధవారం ఏకంగా 1520 కేసులు నమోదైతే అందులో రెండు వంతులపైగా హైదరాబాద్ లోనే నమోదుకావడం ఆందోళన కలిగించే అంశం. గత వారం నుంచి హైదరాబాద్ లో నమోదైన కేసులను పరిశీలిస్తే.. డిసెంబర్ 30న -167, 31న -198, జనవరి 1న -217, జనవరి 2న -212, జనవరి 3న -294, జనవరి 4న -569, జనవరి 5న -979 పాజిటివ్ కేసులు వచ్చాయి.కరోనా కేసులు వచ్చిన ప్రాంతాల్లో వైద్య శాఖ సమన్వయంతో బల్దియా సిబ్బంది వెంటనే శానిటైజేషన్ చేస్తున్నారు. కాలనీల వారీగా కేసుల పాజిటీవిటీ రేటును పరిగణలోకి తీసుకుంటున్నారు. కేసుల సంఖ్య పెరిగితే జీహెచ్ఎంసీ సర్కిళ్ల వారీగా ఐసోలేషన్ కేంద్రాలు రెడీగా ఉన్నాయని.. వాటి తెరిచి బాధితులకు సాయం అందిస్తామని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి చెప్పారు. కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి ప్రజలకు వెంటనే కరోనా సంబంధిత హెల్ప్ చేస్తున్నట్లు వివరించారు. అవసరం లేకుండా బయటకు రావొద్దని.. మాస్క్, శానిటైజర్ తప్పనిసరిగా వాడాలని మేయర్ నగరవాసులకు పిలుపునిస్తున్నారు.బల్దియా

ఆధ్వర్యంలో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఐసోలేషన్ సెంటర్లు సిద్ధంగా ఉన్నాయన్నారు. పాజిటివ్ కేసులు పెరిగితే సర్కిళ్ల వారిగా ఐసోలేషన్ కేంద్రాలు ఓపెన్ చేస్తామన్నారు. కరోనా కేసులు వచ్చిన ప్రాంతాలను గుర్తించి, ఎప్పటికప్పుడు శానిటైజ్ చేస్తున్నామని మేయర్ తెలిపారు. నగరంలో ఇప్పటికే వంద శాతం వ్యాక్సిన్ పూర్తి చేసుకున్నామన్న మేయర్.. బయట నుంచి సిటీకి వస్తున్నవారికి కూడా టీకాలు వేస్తున్నామన్నారు. కరోనా వైరస్ వ్యాప్తి దృష్ట్యా జీహెచ్ఎంసీ కంట్రోల్ రూమ్ 24/7 అందుబాటులో ఉంటుందని విజయలక్ష్మి పేర్కొన్నారు. సహాయం కోసం 040-21111111 డయల్ చేయాలని సూచించిన మేయర్.. అవసరమైనవారికి అందించేందుకు ఐసోలేషన్ కిట్స్, టెస్టింగ్, శానిటేషన్ వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు వైద్య శాఖ సూచనలు పాటించాలి. థర్డ్ వేవ్ ను సమర్ధవంతంగా ఎదుర్కొనేందుకు జీహెచ్ఎంసీ సిద్ధంగా ఉన్నట్లు మేయర్ గద్వాల్ విజయలక్ష్మి స్పష్టం చేశారు.

# ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు

ఏలూరు జనవరి 6, (న్యూస్ పల్స్) ఏలూరు నగరంలో ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేకంగా దృష్టి కేంద్రీకరించాలని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ఆళ్ల నాని సూచించారు. ఏలూరు ట్రాఫిక్ సర్కిల్ ఇన్స్పెక్టర్ గా బాధ్యతలు చేపట్టిన నాగరాజు గురువారం ఏలూరులోని ఉపముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందచేశారు. ఏలూరు నగరంలో రోజురోజుకూ పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సిగ్నల్ లైట్ వ్యవస్థ పటిష్టంగా పనిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆళ్ల నాని ట్రాఫిక్ సిఐ నాగరాజుకు సూచించారు. నగరంలో దొంగతనాల నివారణకు ముఖ్యమైన కూడళ్ళలో సిసి అ కెమేరాలు ఏర్పాటు చేయాలని అన్ని వ్యాపార సంస్థలలో కూడా ముందుస్తుగా దొంగతనాలు నివారించడానికి సిసి కెమేరాలు ఏర్పాటు చేసుకొనే విధంగా వ్యాపార సంస్థల ప్రతినిధులకు అవగాహన కల్పించాలని మంత్రి ఆళ్ల నాని సూచించారు.ఏలూరు నగరంలో యువత వాహనాలు వేగంగా నడిపి ప్రమాదాలకు గురవుతున్నారని వాహనాల వేగం తగ్గించుకొనే విధంగా అన్ని విద్యా సంస్థలలో అవగాహన కల్పించాలని ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించకుండా ట్రాఫిక్ నిబంధనలు సూచించే విధంగా నేమ్ బోర్డులను ఏర్పాటు చేసుకొనే విధంగా చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు.

### శ్రీవారి సన్నిధితో ఎంపి తేజస్వీ సూర్య

తిరుమల బిజెపి ఎంపీ తేజస్వి సూర్య గురువారం శ్రీవారిని దర్శించుకున్నారు. తరువాత అయన మీడియాతో మాట్లాడుతూ కార్యకర్తలు., యువమోర్చ వారితో కలసి శ్రీవారిని దర్శించుకొని ఆశీస్సులు పొందడం చాల సంతోషం. ప్రపంచమంతా సుఖసంతోషాలతో ఉండాలని., స్వీయ సంవృద్ధి దేశంగా భారత్ మరింత బలపడాలని కోరుకున్నా. ఓమిక్రాన్ ముప్పు పొంచి ఉంది., అందరికి ఎదర్కొనే శక్తిని ఇవ్వాలని ప్రార్ధించా . టీనేజర్ల కోసం వ్యాక్సిన్ ప్రక్రియ ప్రారంభించిన ప్రధాని మోదీకి ధన్యవాదాలని అన్నారు.

# మత్స్యకారులు సమన్వయంతో వేట సాగించాలి

**రాష్ట్ర మత్సశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు**

విశాఖపట్నం జనవరి 6, (న్యూస్ పల్స్) విశాఖ జిల్లా మత్స్యకారులు సమన్వయంతో చేపల వేట సాగించుకోవాలని రాష్ట్ర మత్స్య శాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు మత్స్యకారులకు విజ్ఞప్తి చేశారు.విశాఖ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో పర్యాటక శాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, జిల్లా కలెక్టర్ పోలీస్ కమిషనర్ లతో కలిసి మత్స్యకారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లా డుతూ. చట్ట పరిధిలో నియమ నిబంధనలను అనుసరిస్తూ అందరికీ ఆమోదయోగ్యమైన విధంగా మత్స్య కారుల అందరూ జీవనానికి ఆధార మైన వేటను కొనసాగించాలని మంత్రి కోరారు.ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అభివృద్ధికి ఎన్నో కార్యక్రమాలను చేప ట్టాలని,వారికి మరిన్ని సంక్షేమ పథకా లు తెచ్చేందుకు ఆలోచన చేస్తున్నార న్నారు.రాష్ట్ర కేంద్ర ప్రభుత్వ అధికారు లతో టెక్నికల్ కమిటీని వేశామని మెరైన్ ఫిషరీస్ రెగ్యులర్ యాక్ట్ ప్రకారం బోట్లు ఉన్నవారందరూ వేట సాగించడానికి,వలలకు సంబంధించి కూడా లైసెన్సులు పొందాలని చెప్పారు.రాష్ట్ర పరిపాలన రాజధాని గా రూపొందే విశాఖను గతం వలె శాంతియుతంగా ఉంచాలన్నారు.

# రసాయన ఎరువులు వద్దు సేంద్రియ ఎరువులే ముద్దు

**మండల వ్యవసాయ అధికారి కె. కళ్యాణ్ కుమార్**

నంద్యాల జనవరి 6, (న్యూస్ పల్స్) దొర్నిపాడు మండలం డబ్ల్యు కొత్త పల్లె గ్రామంలో బుధవారం నాడు శనగ పంటలో వైయస్ ఆర్ పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి కె. కళ్యాణ్ కుమార్ మాట్లాడుతూ రైతులు సేంద్రీయ ఎరువుల వాడకం వల్ల కలిగే నష్టాలను ఆయన రైతులకు వివరించారు. సేంద్రీయ ఎరువుల వల్ల భూమిలో ఉన్న కిటక నాసి నసించి పోతున్నదని దీని వల్ల వేసిన పంటలకు పలు రకాల తెగుళ్లు సోకి పంట దిగుబడి తగ్గుతుందని ఆయన అన్నారు. పొలం మట్టి రంగులు మారుతున్నదని మరియు సేంద్రియ ఎరువుల వల్ల మనము విషపూరిత ఆహారాన్ని తింటున్నామని దీని వల్ల అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. కావున రైతులు సేంద్రీయ ఎరువుల వాడకం మంచిదని ఆయన అన్నారు. సెనగ పంటలో కాండంతొలుసు పురుగును గుర్తించామని రైతులు హెక్సోకోనోజల్ 20 యమ్ యల్ ఒక లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్. గ్రామ పెద్దలు. వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

# ఉత్కంఠ భరితంగా ద్వితీయ లీగ్ మ్యాచ్ లు

తిరుపతి జనవరి 6, (న్యూస్ పల్స్) ఇందిరా మైదానంలో బుధవారం రాత్రి జరిగిన ద్వితీయ లీగ్ మ్యాచ్ లో ఉత్కంట భరితంగా సాగాయి. పురుషుల విభాగంలో జమ్మూ కాశ్మీర్ 46-37 పాయింట్లతో ఇండియన్ న్యావీ పై నెగ్గింది. నీలాగురై అకాడెమి 32 ? 29 పాయింట్లతో హోన్నప్ప అకాడెమి పై, ఎస్ ఎస్ బి 51 ? 35 తో ఈ ఎస్ ఐ సి జట్టు పై గెలిచింది. మరో మ్యాచ్ లో మహారాష్ట్ర 59- 38 తో హైదరాబాద్ పై విజయం సాదించింది. ఉత్తమ క్రీడా కారులుగా ఆసిస్ (జమ్మూ ఒ కాశ్మీర్ ), డి శక్తి దయా (నీలగిరి అకాడెమి), హావీద్ (ఎస్ ఎస్ బి ), మోనో (మహారాష్ట్ర) నిలిచి నిర్వాహకుల నుంచి రూ.5000/- నగదు బహుమతిని అందుకున్నారు.మహిళా విభాగంలో ఎస్ ఎస్ బి 62 ? 20 పాయింట్ల తేడాతో పశ్చిమ బెంగాల్ పై , కర్నాటక 64-24 తో మహారాష్ట్ర జట్టు పై లీగ్ పోటీకి అర్హత పొందింది. హర్యానా 61 ? 21 తో ఆంధ్ర ప్రదేశ్ బి జట్టుపై సునాయాసంగా నెగ్గింది. మైసూర్ 35 ? 26 చెన్నబసవేశ్వర జట్టు పై విజయాన్ని నమోదు చేసింది. ఈ పోటీలలో ఉత్తమ క్రీడాకారులుగా ప్రియాంక ( ఎస్ ఎస్ బి ) , సోని (కర్నాటక ), సిమ్రాన్ (హర్యానా), పి ఆర్ ప్రీతి (మైసూర్) నిలిచి నిర్వాహకుల నుంచి రూ.5000/- నగదు బహుమతిని అందుకున్నారు.

### కుటుంబ వ్యవహారాలపై కీలక వ్యాఖ్యలు చేసిన సోము వీర్రాజు

**తనకు ముగ్గురు కూతుళ్ళు..ఇద్దరు అల్లుళ్ళు**

**ఆతను నా అల్లుడు కాడు**

అమరావతి జనవరి 6):తన కూతురుతో పాటు కుటుంబ వ్యవహారాలపై సైతం ఏపీ బీజేపీ అధ్యక్షుడు సోము వీర్రాజు కీలక వ్యాఖ్యలు చేశారు. నాకు ముగ్గురు కూతుళ్లు ఉన్నా కూడా..ఇద్దరు అల్లుళ్లే అంటూ సోము బాంబు పేల్చారు.తాను తన పెద్దమ్మాయికి పెళ్లి చేయలేదని.. ఆమే ఇంటినుంచి వెళ్లిపోయి పెళ్లి చేసుకుందని సోము చెప్పారు. తాను కాళ్లు కడిగి కన్యాదానం చేయలేదు కాబట్టి.. అతడు నా అల్లుడు కాదని సోము సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను కన్యాదానం చేయకపోవడంతో తన పెద్ద కుమార్తె భర్తను తాను ఇప్పటికి అల్లుడిగా గుర్తించడం లేదన్నారు. గతంలోనే తాను అతడిపై పోలీసులకు ఫిర్యాదు చేశానని.. అతడికి తనకు ఎలాంటి సంబంధం లేదని సోము చెప్పారు.దయచేసి ఈ కేసు విషయంలో తన పేరు ప్రస్తావించవద్దని చెప్పిన సోము అతడిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరడం గమనార్హం. ఇక సోము పెద్ద అల్లుడిపై చీటింగ్ ఫోర్జరీ కేసు నమోదు అయ్యింది. తమ ఆస్తి పత్రాలను ఫోర్జరీ చేసిన అతడు కొవ్వూరు ఎస్బీఐలో లోన్ తీసుకున్నాడని జయరామకృష్ణ అనే వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అతడి ఫిర్యాదు మేరకు ఈ కేసును క్షుణ్ణంగా విచారించిన పోలీసులు సోమువీర్రాజు అల్లుడు వెంకట నరసింహంపై ఐపీసీ 406 419 420 465 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.ఈ కేసుపై సోము కుమార్తె సూర్యకుమారి కూడా స్పందించారు. తన తండ్రికి ఈ లోన్కు ఎలాంటి సంబంధం లేదని ఆమె చెప్పారు. ఇక తన తండ్రితో కూడా తనకు ఎలాంటి సంబంధం లేదని.. తన పెళ్లి తర్వాత తన తండ్రి ఇప్పటకీ తమ ఇంటికి రాలేదని ఆమె చెప్పారు. ఇక వ్యాపార లావాదేవీల్లో భాగంగానే ఈ కేసు పెట్టారని చెప్పిన ఆమె.. తమను ఈ కేసులో ఉద్దేశ పూర్వకంగానే ఇరికించారని ఆమె ఆరోపించారు.ఇక కొందరు తన తండ్రి ప్రతిష్ట దెబ్బతీసే రాజకీయ కుట్రలో భాగంగానే ఈ ఆరోపణలు చేస్తున్నట్టు చెప్పారు. ఏదేమైనా సోము వీర్రాజు కుటుంబంలో ఇంత ఇష్యూ ఉందన్న విషయం ఆయన చెప్పే వరకు ఎవ్వరికి తెలియదు. ఏపీ బీజేపీ అధ్యక్షుడు సోము వీర్రాజు అల్లుడిపై చీటింగ్ ఫోర్జరీ కేసు నమోదు అయిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఈ విషయం ఏపీ రాజకీయాల్లో సంచలనంగా మారింది. సోము అల్లుడిపై కేసు నమోదు.. సోము ఎలా స్పందిస్తాడో ? చూడాలి అంటూ ఒక్కటే వార్తలు వస్తున్నాయి. ఈ వార్తలు ఇప్పుడు మీడియాలో హైలెట్ కావడంతో సోము స్పందించారు.

# నర్స్ క్వార్టర్స్ లో ప్రభుత్వ స్థలాన్ని కాపాడండి



నంద్యాల జనవరి 6 (( విభారె) నంద్యాలలో కబ్జాలు మితిమిరిపోతున్నా అధికారుల్లో చలనం లేదు.రాజకీయ అండదండలు ఉన్న చోటా మోటా నాయకులు ప్రభుత్వ స్థలాలపై కన్నేశారు.అధికారులు ప్రభుత్వ స్థలాలు గుర్తించి కంచెలు వేయకపోవడంతో కబ్జాలు పెరిగి పోతున్నాయి.ఈ నేపథ్యంలో కోటి విలువచేసే ప్రభుత్వ స్థలంపై కొందరి కన్ను పడింది.రెండేళ్ల క్రితం ఏకంగా ఆ స్థలంలో బేస్ మట్టం వేయడంతో స్థానికులు అధికారులకు సమాచారం ఇవ్వడంతో నిర్మాణం ఆపేశారు.నంద్యాలలో స్థలాలకు రెక్కలు రావడంతో ఆ స్థలం విలువ సుమారు కోటి రూపాయలు పలుకు తుండడంతో కొందరు తమ పలుకుబడిని ఉపయోగించి ప్రభుత్వ స్థలం మాదేనంటూ దొంగ డాక్యుమెంట్స్ సృష్టించి విక్రయానికి పెట్టినట్లు సమాచారం.వివరాల్లోకి వెళితే నూనెపల్లిలో కొన్నేళ్ల క్రితం నర్స్ క్వాటర్స్ ఏర్పడింది.అప్పటి ముఖ్యమంత్రి దామోదర సంజీవయ్య హయాంలో కర్నూల్ జిల్లా లో నంద్యాల,ఆదోని ప్రాంతాల్లో ఇండ్రస్టీయిల్ హోసింగ్ కాలనీలు రూపుదిద్దుకున్నాయి.ప్రధానంగా ఈ కాలనీలు ఏర్పాటుకు కారణం నర్స్ ట్రైనింగ్ తీసుకున్నవారు ఉండడానికి ఏర్పాటుచేశారు.సుమారు 3 ఎకరాల్లో కాలనీ ఏర్పాటైనట్లు సమాచారం.ఈ కాలనిలో అప్పట్లో ప్రభుత్వం 55 ఇల్లు కట్టించింది.ట్రైనింగ్ పొందుతున్నవారు ఈ ఇంట్లో ఉండేందుకు నెలకు 5 రూపాయల బాడుగ చెల్లించేవారు.కాలక్రమేణా నర్సింగ్ సెంటర్ కర్నూల్ కు మార్చుబడింది.ఈ నేపథ్యంలోనే కట్టిన ఇల్లు పాడైపోకుండా ఉండేందుకు వివిధ ఫ్యాక్టరీలలో పనిచేస్తున్న కార్మికుల కు బడుగకు ఇచ్చారు.ప్రభుత్వం కొన్నేళ్ల తర్వాత 15,18 ఏళ్ళు ఆ ఇంటిలోనే నివసిస్తున్న కార్మికుల వద్ద కొంత నగదు తీసుకొని వారికే ధారాదత్తం చేసింది.కొన్నేళ్ల తర్వాత కార్మికులు కొందరు ధరలు పెరగడంతో కొందరు ఇతరులకు విక్రయించారు.ఈ కాలానికి సంభందించిన 8 సెంట్ల మిగులు భూమి ఉంది.ఈ మిగులు భూమి ని అధికారులు ఎవరు పట్టించుకోకపోవడంతో కొందరికి కన్ను పడింది.ప్రభుత్వ భూమి అయితే మాకేంటి అన్న చందంగా ఏకంగా ఈ భూమిలో బేస్ మెంట్ వేశారు.ఈ విషయాన్ని కార్మిక శాఖ అధికారులకు స్థానికులు తెలపడంతో సంబంధిత అధికారులు అప్పట్లో ఆ నిర్మాణాన్ని ఆపివేశారు.కార్మిక శాఖకు చెందిన రెండు బోర్డులు ఏర్పాటు చేశారు.నేడు ఈ స్థలానికి రెక్కలు రావడంతో కొందరు కబ్జా దారులు రాత్రికి రాత్రి ప్రభుత్వం ఏర్పాటు చేసిన బోర్డులను తొలగించారు.ఆ స్థలం పై మాకు సర్వహక్కులు ఉన్నాయంటూ దొంగ డాక్యుమెంట్స్ సృష్టించి విక్రయానికి పెట్టినట్లు సమాచారం.ఈ స్థలం కబ్జాకు గురికాకుండా కొందరు పశువుల పాక వేసుకొని స్థలాన్ని కాపాడుతున్నారు.ప్రభుత్వ అధికారులు ఇప్పటికైనా స్పందించి ఆ స్థలంలో నిర్మాణాలు చేపట్టి కోటి విలువైన స్థలాన్ని కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

## బ్రాహ్మణ కొట్కూరు పోలీస్ స్టేషన్ ముందు ఉద్రిక్తత

*మాజీ ఎమ్మెల్యే బుడ్డా ను అడ్డుకున్న పోలీసులు*

*కర్నూలు గుంటూరు ప్రధాన రహదారిపై భారీగా నిలిచిపోయిన వాహనాలు*

*కె సి, తెలుగు గంగా కాలువలకు సాగునీటిని అందించాలని డిమాండ్*

నందికొట్కూర్: జనవరి 6 (( విభారె) := శ్రీశైలం నియోజకవర్గం లోని వెలుగోడు బండి ఆత్మకూరు మండలాలకు చెందిన రైతులకు రవికి కేసీ కాలువ తెలుగుగంగ ద్వారా సాగునీటిని అందించాలని కర్నూలు కలెక్టరేట్ లో జరిగే డి డి ఆర్ సి సమావేశంలో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి జిల్లా ఇన్చార్జి మంత్రి అనిల్ కుమార్ యాదవ్ కు వినతిపత్రం ఇచ్చేందుకు రైతులతో కలిసి భారీ కాన్వాయ్ తో వెళ్తున్నా శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి ని కర్నూలు గుంటూరు ప్రధాన రహదారిపై బ్రాహ్మణ కొట్కూర్ పోలీస్ స్టేషన్ ముందు స్థానిక ఎస్ఐ ఓబులేష్, కర్నూలు కి వెళ్తున్నా వాహనాలను నిలిపివేయడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఆగ్రహించిన రైతులు, మాజీ ఎమ్మెల్యేబుడ్డా రాజశేఖర్ రెడ్డి రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. దీంతో కేజీ రోడ్డుపై వెళ్లే వాహనాలు భారీ సంఖ్యలో నిలిచిపోయాయి. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బుడ్డా మాట్లాడుతూ శ్రీశైలం నియోజకవర్గం లోని వెలుగోడు, బండి ఆత్మకూరు, మహానంది మండలం లో నీ రైతులు ఇప్పటికే సాగుచేస్తున్న పంటలకుసాగునీరు అందివ్వాలని గురువారం కర్నూలు కలెక్టరేట్ లో జరిగే డి డి ఆర్ సి సమావేశంలో పాల్గొనే రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి జిల్లా ఇన్చార్జి,మంత్రి అయినా అనిల్ కుమార్ యాదవ్ దృష్టికి తీసుకెళ్తున్న తమనూ ఆ కారణంగా పోలీసులు ఆపివేయడం తగదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం స్థానిక ఎస్సై ఓబులేష్ పోలీసు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వారి సూచనల మేరకు మాజీ ఎమ్మెల్యే బుడ్డా ను రైతుల వాహనాలను వదిలిపెట్టారు.

# ముఖ్యమంత్రి గారు నంద్యాల ప్రాంత రైతు. ప్రజా సమస్యలు పరిష్కరించండి




నంద్యాల జనవరి 6 (( విభారె) నంద్యాల ప్రాంత నియోజకవర్గం .పట్టణ ప్రాంతాలలో ప్రజల.రైతుల. కార్మికుల .సమస్యలను రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి వెంటనే పరిష్కరించాలని సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి. ఎస్ బాబా ఫక్రుద్దీన్. సిపిఐ పట్టణ కార్యదర్శి కె. ప్రసాద్. ఏఐటీయుసి కార్యదర్శి. డి.. శ్రీనివాసులు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కార్యదర్శి జి.సోమన్న. సిపిఐ నాయకులు భూమని శ్రీనివాసులు తెలిపారు.స్థానిక సిపిఐ కార్యాలయంలో విలేకరుల సమావేశం జరిగింది ఈ సమావేశంలో పై నాయకులు మాట్లాడుతూ,నంద్యాల కు ఈనెల 10వ తేదీ రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పర్యటన సందర్భంగా నంద్యాల ప్రాంతాల్లో గత

### సిపిఐ పార్టీ విన్నపం...

కొన్ని సంవత్సరాలుగా నెలకొన్న రైతు ప్రజా సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది అని అన్నారు.రాష్ట్రంలో వైయస్సార్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మూడు సంవత్సరాల పాలనలో నంద్యాల నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులు శంకుస్థాపన లకు పరిమితం అయ్యాయని పనులు ఏ మాత్రం ముందుకు జరగడం లేదని అన్నారు. గత ప్రభుత్వం చేసిన పనులు తప్ప ఏమీ జరగలేదని విమర్శించారు. నంద్యాల డివిజన్ పరిధిలో అకాల వర్షాల వల్ల చేతికొచ్చిన పంటలు వందల ఎకరాలు మునిగి నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించడంలో అధికారులు పూర్తిగా విఫలం చెందారని. 25 వేల రూపాయల నష్టపరిహారం అందించాలని అన్నారు. పట్టణంలో వరద కట్ట నిర్మాణము చేపట్టక పోవడం వల్ల.రోడ్లు అస్తవ్యస్తంగా ఉండడంవల్ల. డ్రైనేజ్ కాలవ లో సరిగా లేకపోవడం వల్ల ప్రజలు ప్రమాదాలకు గురి అవుతున్నారని అన్నారు. పట్టణంలోవక్ఫ్ బోర్డు భూములు అన్యాక్రాంతమై నాయి అని వాటి ని పరిరక్షించడంలో వక్ఫ్ బోర్డు అధికారులు పూర్తిగా వైఫల్యం చెందారని అన్నారు.ఇలాంటి అనేక సమస్యలపై రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కి వినతి పత్రం ద్వారా సమస్యలు తెలియజేయుటకు సిద్ధంగా ఉన్నామని అందుకు అవకాశం అందకపోతే ముఖ్యమంత్రి కార్యక్రమం లో నిరసన లు తెలుపుతామని పై నాయకులు అధికారులకు తెలియచేస్తున్నామని అన్నారు.


## కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాష్ట్ర అభివృద్ధిపై దృష్టి సారించాలి

*సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.ప్రభాకర్ రెడ్డి...*




నంద్యాల జనవరి 6 ( విభారె) కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అభివృద్ధి చేయడంలో ఘోరంగా విఫలం చెందుతున్నాయని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.ప్రభాకర్ రెడ్డి అన్నారు.సిపిఎం జిల్లా కార్యాలయంలో జిల్లాలోని పార్టీ శాఖ కార్యదర్శుల విస్తృత సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం. నాగేశ్వర రావు అధ్యక్షత వహించగా ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి రమేష్ కుమార్,జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎ.నాగరాజు,జిల్లా నాయకులు మస్తాన్ వలి,సద్దాం హుస్సేన్,గౌస్,నరసింహ, రణదిర్,రత్నమయ్య, ఈశ్వరయ్య,నరసింహ నాయక్,స్యామన్న, జి.షేబారాణి,రజిత లతో జిల్లా నలుమూలల నుండి శాఖా కార్యదర్శులు పాల్గొనడం జరిగింది. ఈ సందర్బంగా రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యులు కె.ప్రభాకర్ రెడ్డి ,జిల్లా కార్యదర్శి టి.రమేష్ కుమార్ మాట్లాడుతూ ఈ రోజు కేంద్రంలో వున్న బిజెపి ప్రభుత్వం గాని రాష్ట్రంలో వున్న వైయస్ ఆర్ సిపి ప్రభుత్వం గాని,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అభివృద్ది పరచటంలో పూర్తిగా విఫలం చెందాయి.అయితే రాష్ట్రంలో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించటంలో వైపల్యం చెందారు. రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ సంస్థలను ప్రైవేటుపరం చేయటానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూనుకున్నాయి.

# క్రేజీ భామల సరదా సంక్రాంతి ఫైట్




ఈ సంక్రాంతికి భారీ చిత్రాలు పోటీపడుతుండటంతో చిన్న సినిమాలు రిలీజ్ గురించి పెద్దగా ఆలోచించలేదు. సినిమా రిలీజ్ కి రెడీగా వున్నా 'ఆర్ ఆర్ ఆర్' రాధేశ్యామ్ వంటి పాన్ ఇండియా చిత్రాల మధ్య థియేటర్లు లభించవని తెలిసి ఏ చిన్న సినిమా నిర్మాత సహసం చేయలేదు. కానీ ఎప్పుడైతే ఆర్ ఆర్ ఆర్ రాధేశ్యామ్ రిలీజ్ వాయిదా పడ్డాయే అప్పుడే చిన్ని చితకా సినిమాలన్నీ సంక్రాంతికి వచ్చేస్తున్నామంటూ ప్రకటించేశాయి. ఏకంగా రిలీజ్ డేట్ లు కూడా ప్రకటించేశాయి.పదికి పైగా చిత్రాలు ఈ సంక్రాంతికి పోటీపడబోతున్నాయి. ఈ మూవీలతో సంక్రాంతికి క్రేజీ హీరోయిన్ లు పోటీపడుతున్నాయి. ఈ రేసులో ముందు వరుసలో నిలిచిన క్రేజీ లేడీ కృతిశెట్టి. 'ఉప్పెన' మూవీతో సత్తాచాటిన కృతిశెట్టి తాజాగా నేచురల్ స్టార్ నాని నటించిన 'శ్యామ్ సింగ రాయ్'తో మెస్మరైజ్ చేసింది. వరుస లిప్ లాక్ లతో నానితో ఓ రేంజ్ లో రెచ్చిపోయి రచ్చ రచ్చ చేసింది. ఇప్పుడు ఈ సంక్రాంతికి 'బంగార్రాజు'తో సందడి చేయబోతోంది. కింగ్ నాగార్జున నాగచైతన్య కలిసి నటించిన చిత్రమిది.2016లో వచ్చిన 'సోగ్గాడే చిన్నినాయన' చిత్రానికి స్రీక్వెల్ గా 'బంగార్రాజు'ని నిర్మించారు. సంక్రాంతి బరిలో ఈ మూవీ గట్టి పోటీనివ్వబోతోంది. అయితే ఇందులో కృతిశెట్టి హీరో నాగచైతన్యకు జోడీగా కనిపించబోతోంది. ఇప్పటి వరకు వీరిద్దరికి సంబంధించిన ఫస్ట్ లుక్ ని వదిలారు. బుధవారం వీరిద్దరిపై చిత్రీకరించిన 'బంగారం.. ' అంటూ సాగే లిరికల్ వీడియోని విడుదల చేస్తున్నారు. ఈ మూవీతో మరో హిట్ ని తన ఖాతాలో వేసుకోవాలని కృతిశెట్టి చాలా కాన్ఫిడెంట్ గా ఎదురుచూస్తోంది.ఇక కృతి శెట్టి తరువాత ఈ సంక్రాంతి రేసులో వున్న హీరోయిన్ అనుపమ పరమేశ్వరన్. తన నుంచి సినిమా వచ్చి దాదాపు మూడళ్లు కావస్తోంది. ఆమె నటించిన తాజా చిత్రం 'రౌడీ బాయ్స్' మూవీతో ప్రేక్షకుల ముందుకొస్తోంది. దిల్ రాజు సోదరుడు అయిన శిరీష్ తనయుడు ఆశిష్ రెడ్డి ఈ చిత్రంద ద్వారా హీరోగా పరిచయం అవుతున్నాడు. దిల్ రాజు బ్యానర్ లో వస్తున్న సినిమా కావడంతో ఈ చిత్రంపై అంచనాలున్నాయి. మూడేళ్ల విరామం తరువాత తన నుంచి వస్తున్న కావడంతో అనుపమ పరమేశ్వరన్ ఈ మూవీపై భారీ ఆశలు పెట్టుకుందట.ఆ తరువాత పోటీలో పడుతున్న హీరోయిన్ నిధి అగర్వాల్. ఆమె నటించిన సినిమా ప్రేక్షకుల ముందుకొచ్చి దాదాపు మూడేళ్లవుతోంది. 'ఇస్మార్ట్ శంకర్'తో కెరీర్లో తొలి బ్లాక్ బస్టర్ ని అందుకున్న నిధి అగర్వాల్ నటించిన తాజా చిత్రం 'హీరో'. సూపర్ స్టార్ మహేష్ బాబు మేనల్లుడు అశోక్ గల్లా ఈ మూవీ ద్వారా హీరోగా పరిచయం అవుతున్నారు. శ్రీరామ్ ఆదిత్య డైరెక్ట్ చేస్తున్న ఈ మూవీ జనవరి 15న సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ మూవీపై నిధి భారీ అంచనాలే పెట్టుకుంది.ఇక కన్నడ చిత్రం 'ఐ లవ్ యూ' మూవీతో వార్తల్లో నిలిచిన రుచితా రామ్ 'సూపర్ మచ్చి' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయం కాబోతోంది. కల్యాణ్ దేవ్ హీరోగా నటించిన ఈ మూవీ జనవరి 14న విడుదల కాబోతోంది. ఇదే మూవీతో పాటు సిద్ధు జొన్నలగడ్డ నటించిన 'డీజే టిల్లు' విడుదలవుతోంది. సితార ఎంటర్టైన్మెంట్స్ సంస్థ నిర్మించిన ఈ మూవీలో హీరోయిన్ గా 'గల్లీరౌడీ' ఫేమ్ నేహా శెట్టి నటించింది. ఇక వీరితో పాటు 'అతిథి దేవోభవ'తో నివేక్ష 7 డేస్ 6 నైట్స్ తో మెహర్ చావల్ కూడా పోటీపడుతున్నారు. క్రేజీ భామల సరదా సంక్రాంతి ఫైట్ లో ఎవరిది పై చేయి కానుందో వేచి చూడాల్సిందే.

# తలా అజిత్ మార్కెట్ మరీ అంత లేదా?




తళా అజిత్ నటించిన సినిమాలు తమిళంలో 100కోట్లు పైగా కలెక్షన్స్ తో సునామీ సృష్టించడం రెగ్యులర్ గా చూస్తూనే ఉన్నాం. అయితే అతడికి తెలుగులో అంతగా మార్కెట్ లేదా? తన రేంజ్ ఇక్కడ 5 కోట్లు మించడం లేదా? అంటే అవుననే గుసగుసలు వినిపిస్తున్నాయి.అజిత్ నటించిన క్రేజీ మూవీ 'వలీమై' తెలుగు రైట్స్ కి 5కోట్లు వెచ్చించారని తెలిసింది. ఇది అజిత్ కి పెద్ద రేటు .. ఆ మొత్తాన్ని తిరిగి వెనక్కి తేవడం అంత సులువేమీ కాదని ట్రేడ్ విశ్లేషించడం ఆశ్చర్యపరుస్తోంది.అయితే దీనికి కారణం ప్రస్తుతం ఉన్న ఓమిక్రాన్ పరిణామంతో పాటు ఆంధ్రప్రదేశ్ లో టికెట్ రేట్ల సమస్య కూడా ఒక కారణం. నిజానికి అజిత్ ఇతర తమిళ హీరోలతో పోటీపడుతూ వరుస హిట్లు అందుకుంటున్నా అది తమిళం వరకే పరిమితం. తెలుగు బాక్సాఫీస్ వద్ద ఇటీవల అంతగా రాణించడం లేదు. అయితే వలీమై తో దానిని తిరగరాస్తాడనే భావిస్తున్నారు. దురదృష్ట వశాత్తూ ఈ సంక్రాంతి రేసునుంచి అజిత్ వలీమై తప్పుకుంది. తిరిగి ఎప్పుడు రిలీజవుతుందో అధికారికంగా ప్రకటించాల్సి ఉంది.

# బాలయ్య-పూరీ కాంబో...అక్కడే క్లారిటీ ?



నందమూరి బాలక్రిష్ణ ఒక్కసారిగా జోరు పెంచేశారు. ఆయన బోయపాటి శ్రీను డైరెక్షన్ లో చేసిన సినిమా లేటెస్ట్ గా రిలీజ్ అయి బ్లాక్ బస్టర్ హిట్ కొట్టింది. దీంతో బాలయ్య ఇమేజ్ ఒక్కసారిగా వేరే లెవెల్ కి వెళ్ళిపోయింది. ఈ సినిమాతో వంద కోట్ల క్లబ్ లో చేరిన బాలయ్య వరసబెట్టి సినిమాలకు కమిట్ అవుతున్నారు. క్రాక్ తో సూపర్ హిట్ కొట్టిన గోపీచంద్ మలినేని డైరెక్షన్ లో బాలయ్య మూవీ సంక్రాంతి తరువాత సెట్స్ మీదకు వెళ్ళే అవకశాలు ఉన్నాయి.ఈ మూవీ శరవేగంగా షూటింగ్ పూర్తి చేసుకుని ఈ దసరాకు రిలీజ్ చేసేందుకు సన్నాహాలు చేస్తారు అని తెలుస్తోంది. ఇక 2022 ద్వితీయార్ధంలో బాలయ్య అనిల్ రావిపూడి మూవీ షూటింగ్ స్టార్ట్ అవుతుంది అని అంటున్నారు. ఈ మూవీ షూటింగ్ కూడా ఆరు నెలల్లో పూర్తి చేసుకుని 2023 సంక్రాంతి బరిలో దింపుతారు అని ప్రచారం సాగుతోంది.ఈ రెండు సినిమాల తరువాత బాలయ్య రచ్చతో సూపర్ హిట్ కొట్టి లేటెస్ట్ గా గోపీ చంద్ సిటీ మార్ తో లైమ్ లైట్ లోకి వచ్చిన సంపత్ నంది డైరెక్షన్ లో ఒక సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని అంటున్నారు. ఈ మూవీ వచ్చే ఏడాది సెట్స్ మీదకు రానుంది. ఈ మూవీ తరువాత పూరీ జగన్నాధ్ డైరెక్షన్ లో బాలయ్య మూవీ ఉంటుంది అని తెలుస్తోంది.బాలయ్య పూరీ ఫస్ట్ కలయికలో వచ్చిన పైసా వసూల్ ఒక డిఫరెంట్ మూవీగా నిలిచింది. టోటల్ గా బాలయ్య ఇమేజ్ ని బాడీ లాంగ్వేజ్ ని మార్చేసిన క్రెడిట్ ని పూరీ సొంతం చేసుకున్నాడు. ఇక ఈ ఇద్దరి కాంబోలో రెండవ సినిమా అనుకుంటున్నా ఇప్పటిదాకా రాలేదు. అయితే వచ్చే ఏడాది ఈ కాంబో సెట్స్ మీదకు వస్తుంది అంటున్నారు. ఈ విషయం పక్కా క్లారిటీతో చెప్పే షో అన్ స్టాపబుల్ అంటున్నారు. విజయ్ దేవరకొండతో లైగర్ మూవీని తీస్తున్న పూరీ అన్ స్టాపబుల్ షోకి విజయ్ ని వెంటబెట్టుకుని మరీ వస్తున్నాడు.బాలయ్యతో తన మూవీని అక్కడే పూరీ అనౌన్స్ చేస్తాడు అని అంటున్నారు. మొత్తానికి పూరీ బాలయ్య క్రేజీ కాంబో మీద అంచనాలు అయితే బాగానే ఉన్నాయి. చూడాలి మరి ఈ ఇద్దరూ కలసి అన్ స్టాపబుల్ లో ఏ రకమైన సంచలన ప్రకటన చేస్తారో.

# జబర్దస్త్ కెప్టెన్ ఎల్గర్.. కేవలం తన గురించే: రిషభ్ పంత్ కామెంట్స్ వైరల్



సఫారీ గడ్డ మీద టెస్టు సిరీస్ విజయం సాధించాలనే తపనతో టీమిండియా.. సెంచూరియన్ పరాభవానికి బదులు తీర్చుకోవాలనే కసితో దక్షిణాఫ్రికా.. వెరసి వాండరర్స్ వేదికగా మొదలైన రెండో టెస్టు పోటాపోటీగా సాగుతోంది. అదే స్థాయిలో మైదానంలో ఆటగాళ్ల మధ్య వాగ్వాదాలు చోటుచేసుకుంటున్నాయి. ప్రొటీస్ ఆటగాడు డసెన్, భారత తాత్కాలిక కెప్టెన్ కేఎల్ రాహుల్ అవుటైన తీరుపై పెద్ద రాద్ధాంతమే జరిగిన సంగతి తెలిసిందే. ఇక మూడో రోజు ఆటలో భాగంగా బుమ్రాకు.. దక్షిణాఫ్రికా బౌలర్ మార్కో జాన్సెన్‌కు మధ్య మాటల యుద్ధం నడించింది. ఇందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.తాజాగా టీమిండియా వికెట్ కీపర్ రిషభ్ పంత్‌కు సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయి. దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్‌లో భాగంగా 28వ ఓవర్‌లో అశ్విన్ వేసిన బంతికి ప్రొటీస్ బ్యాటర్ కీగన్ పీటర్సన్ ఎల్బీడబ్ల్యూ అయ్యాడు. దీంతో అశూతో పాటు పంత్ బిగ్గరగా అప్పీలు చేయగా.. అంపైర్ అవుట్ ఇచ్చాడు. అయితే, డీఆర్ఎస్‌కు వెళ్లాలా లేదా అన్న అంశంపై మరో ఎండ్‌లో ఉన్న ప్రొటీస్ కెప్టెన్ డీన్ ఎల్గర్ తర్జనభర్జన పడ్డాడు.రివ్యూకు వెళ్లాలా వద్దా అన్న అంశం గురించి పీటర్సన్‌తో చర్చించాడు. ఇంతలోనే డీఆర్ఎస్ మీటర్ టైమ్ అయిపోయింది. ఈ నేపథ్యంలో పంత్ ఎల్గర్‌ను తన మాటలతో కవ్వించాడు. "జబర్దస్త్ కెప్టెన్.. కేవలం తన గురించి మాత్రమే ఆలోచిస్తాడు" అంటూ కామెంట్ చేయగా.. ఆ వీడియో వైరల్ అవుతోంది. ఇక ఆట విషయానికొస్తే ఇంకో ఎనిమిది వికెట్లు పడగొడితే విజయం భారత్‌ను వరిస్తుంది.. అదే 122 పరుగులు చేస్తే గెలుపు ప్రొటీస్ జట్టు సొంతమవుతుంది. కాగా నాలుగో రోజు ఆటకు వర్షం కారణంగా ఆటంకం ఏర్పడింది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190